# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

11.04.2026
శనివారం Satrday

సంపుటి (volume): 1
సంచిక (Issue): 259

పేజీలు : 13
Pages : 13

వెల రూ. 2.00

Published from : Hyderabad
Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789




## హెచ్ఐవీ రక్తం ఎక్కించిన ఘటన

ఆత్మహత్య చేసుకున్న యువతి

.. వివరాలు 2లో



## కేశాలు సరెండర్

మొత్తం 42 మంది ఆయుధాలతో లొంగుబాటు

వారికి పునరావాసం కల్పిస్తామన్న డీజీపీ శివధర్ రెడ్డి

.. వివరాలు 2లో

# ఫ్లై91



### హైదరాబాద్ - విజయవాడ మధ్య విమాన సర్వీసు



### ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

సామాన్యుడికి చేరువగా ఆకాశ ప్రయాణం..

## గంటలోపే గమ్యస్థానానికి..

2

## రాష్ట్రపతి, ప్రధానితో గవర్నర్ భేటీ



3



2

## కాలిన నోట్ల కట్టల వ్యవహారం

### జస్టిస్ యశ్వంత్ వర్మ రాజీనామా

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ముర్ముకు పంపారు.



## నేడు ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు

- నగరంలో రెడ్ అలర్ట్ ప్రకటన
- భారీగా బందోబస్తు ఏర్పాటు

4



## పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై

# కాంగ్రెస్ ఫోకస్

- మహిళా బిల్లు, డిలిమిటేషన్ అంశాలపై చర్చ
- ఈ రెండు అంశాలపై కాంగ్రెస్ సుదీర్ఘ కసరత్తు
- రాజకీయ లబ్ధికోసంమే ప్రత్యేక సమావేశాలన్న ఖర్గే
- తెలంగాణలో డీ లిమిటేషన్‌పై రేవంత్ నివేదిక సమర్పణ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** జాతీయ రాజకీయాల్లో రాబోయే మార్పులు, కేంద్ర ప్రభుత్వ వ్యూహాలను తిప్పికొట్టే దిశగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం సమాలోచనలు చేసింది. ముఖ్యంగా పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. మహిళా బిల్లు, సీట్లు పెంపుదల వంటి రెండు అంశాలపై వ్యూహాత్మకంగా ఉండాలని నిర్ణయించారు. ఢిల్లీ ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీసమావేశం అత్యంత

మిగతా 2 లో

## అన్నా.. నన్ను దేవుడే

# పంపిండు



### మీతో కలిసి పని చేయమని చెప్పిండు

- ఎర్రవల్లిలో కేసీఆర్‌తో జీవన్ రెడ్డి భేటీ
- ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని పలుకరించిన కేసీఆర్

'అన్నా.. నన్ను దేవుడే పంపిండు. మీతో కలిసి పని చేయమని' అంటూ కేసీఆర్‌ను మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి ప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. శుక్రవారం ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి తొలిసారి వచ్చిన జీవన్ రెడ్డిని కేటీఆర్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

**గజ్వేల్, ఏప్రిల్ 10:** బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌ను మాజీ మంత్రి జీవన్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి కేసీఆర్‌ను పలకరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. 'అన్నా.. నన్ను దేవుడే పంపిండు. మీతో కలిసి పని చేయమని' అంటూ కేసీఆర్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన జీవన్ రెడ్డి , కుమారులు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు కేసీఆర్‌ను కలిసినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై చర్చించారు.

మిగతా 2 లో

## పొన్నాల ఎక్కడున్నారో తెలుసా?

- జీవన్ రెడ్డి వ్యాఖ్యలపై రేవంత్ కౌంటర్!
- బీఆర్ఎస్‌లో సీనియర్లకు జరిగిన అవమానాలు గుర్తులేవా?
- ఢిల్లీ వేదికగా సీఎం ఘాటు వ్యాఖ్యలు
- పార్టీ వీడిన నేతల జాబితాను ఏకరువు పెట్టిన రేవంత్ రెడ్డి..
- విమర్శలను లైట్ తీసుకున్న ముఖ్యమంత్రి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి తనదైన శైలిలో స్పందించారు. కాంగ్రెస్‌లో సీనియర్లకు అన్యాయం జరుగుతోందన్న విమర్శలను తిప్పికొడుతూనే, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలక నేతలకు ఎదురైన పరాభావాలను ఆయన గుర్తుచేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం, శుక్రవారం మీడియా ప్రతినిధులతో జరిగిన చిట్‌చాట్‌లో ఈ అంశంపై

మిగతా 2 లో



## రేపే ఇంటర్ రిజల్ట్స్!

- ఒకేసారి ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు..
- 9 లక్షల మంది నిరీక్షణకు తెర

2






# ఫ్లై 91 విమాన సర్వీసు ప్రారంభం

**శ్రీకాకుళం/విజయవాడ, ఏప్రిల్10:** హైదరాబాద్ - విజయవాడ మధ్య ప్రయాణించే వారికి శుభవార్త. ప్రాంతీయ విమానయాన సంస్థ ఫ్లై 91 తన నూతన సర్వీసులను తెలుగు రాష్ట్రాల మధ్య అధికారికంగా ప్రారంభించింది. రెండు తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య ప్రయాణ దూరాన్ని తగ్గించడంతో పాటు, సామాన్యులకు విమాన ప్రయాణాన్ని చేరువ చేసే లక్ష్యంతో ఫ్లై 91 సంస్థ తన కార్యకలాపాలను విస్తరించింది. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ నూతన సర్వీసును శ్రీకాకుళం నుంచి వర్చువల్‌గా పచ్చజెండా ఊపి ఈ సర్వీసును శుక్రవారం ప్రారంభించారు. తక్కువ ధరలో వేగవంతమైన ప్రయాణాన్ని అందించడమే ఈ సంస్థ ప్రధాన ఉద్దేశ్యం. విమాన సర్వీసును ప్రారంభించిన అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా టైర్-2, టైర్-3 నగరాలను అనుసంధానించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రాంతీయ కనెక్టివిటీని పెంచడం ద్వారా సామాన్యులు కూడా విమానం ఎక్కాలన్న ప్రధానమంత్రి కల నిజమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ - హైదరాబాద్ మధ్య రద్దీ దృష్ట్యా ఈ సర్వీస్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.రోడ్డు మార్గంలో సుమారు 5 నుంచి 6 గంటల సమయం పట్టే ప్రయాణం, విమానం ద్వారా కేవలం 50 నిమిషాల నుంచి గంటలో పూర్తవుతుంది. హైదరాబాద్‌లో ఐటీ రంగం, విజయవాడలో వ్యాపార రంగాలు బలంగా ఉన్న నేపథ్యంలో, ఈ విమాన సర్వీస్ వ్యాపారవేత్తలకు వరంలా మారనుంది. ఫ్లై 91 సంస్థ తన టికెట్ ధరలను ఇతర విమాన సంస్థలతో పోలిస్తే అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు చేస్తోంది. ఈ సంస్థ గోవా కేంద్రంగా పనిచేస్తున్న ఒక ప్రాంతీయ విమానయాన సంస్థ. ఇది ప్రధానంగా తక్కువ దూరం ఉండే నగరాల మధ్య సర్వీసులను నడుపుతోంది. తెలుగు రాష్ట్రాల్లో తమ నెట్‌వర్క్‌ను పెంచుకోవడం ద్వారా ప్రయాణికులకు మరిన్నిసౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కొత్త సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల అటు విజయవాడ ప్రాంత ప్రజలకు, ఇటు హైదరాబాద్ ప్రజలకు రవాణా పరంగా మరిన్ని వెసులుబాట్లు కలగనున్నాయి. ఈ విమాన సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల రోడ్డు ప్రయాణంపై ఒత్తిడి తగ్గనుందని భావిస్తున్నారు.

# రేపే ఇంటర్ రిజల్ట్!

**ఒకేసారి ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు..**

**హైదరాబాద్, ఏప్రిల్ 10 :** తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఫలితాల సందడి మొదలైంది. ఈనెల 12న (ఆదివారం) ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను విడుదల చేసేందుకు తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలుత ఏప్రిల్ 11న ఫలితాలు రావచ్చని భావించినప్పటికీ, సాంకేతిక తనిఖీలు మరియు తుది ఏర్పాట్ల నేపథ్యంలో ఏప్రిల్ 12ను ముహూర్తంగా ఖరారు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 26 నుంచి మార్చి 18 వరకు జరిగిన ఇంటర్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9 లక్షలకు పైగా విద్యార్థులు హాజరయ్యారు. కాగా, తొలుత ఏప్రిల్ 11న ఫలితాలు రావచ్చని భావించినప్పటికీ, తుది ఏర్పాట్ల నేపథ్యంలో ఏప్రిల్ 12న ఫలితాలను ప్రకటించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఫలితాలు విడుదలైన వెంటనే విద్యార్థులు బోర్డు అధికారిక వెబ్‌సైట్ల(స్త్రఎఅవ.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ)తో పాటు మొబైల్ యాప్స్ ద్వారా తమ మార్కులను తెలుసుకోవచ్చు. ఫలితాల్లో ఏదైనా తేడా ఉంటే రీ-కౌంటింగ్ లేదా రీ-వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు బోర్డు ప్రత్యేకంగా గడువు ఇవ్వనుంది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 1 నుంచి జూనియర్ కళాశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఈసారి రికార్డు స్థాయిలో వేగంగా ఫలితాలను వెల్లడిస్తుండటం విశేషం.

# హెచ్‌ఐవీ రక్తం ఎక్కించిన ఘటన

**ఆత్మహత్య చేసుకున్న యువతి**

**హైదరాబాద్, ఏప్రిల్ 10:** ప్రేమించిన అమ్మాయికి హెచ్‌ఐవీ రక్తం ఎక్కించిన ఘటనలో సదరు యువతి రమణి(23) ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మేడ్చల్ జిల్లా అన్నోజిగూడ రాజీవ్ గృహకల్పలోని తమ ఇంట్లో రమణి ఆత్మహత్యకు పాల్పడింది. పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన రమణి.. ఎదులాబాద్‌లోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. అయితే, సమీప బంధువైన మనోహర్‌తో ఆమెకు నిశ్చితార్థం చేశారు కుటుంబసభ్యులు. పెళ్లికి అంతా సిద్ధమైన తర్వాత వైద్య పరీక్షల్లో అతనికి ఎయిడ్స్ ఉందని తేలింది. దీంతో యువతి కుటుంబసభ్యులు మనోహర్‌తో పెళ్లికి నిరాకరించారు. ఇది మనసులో పెట్టుకున్న నిందితుడు తనను వివాహం చేసుకోవాలని రమణిని పలుమార్లు బలవంతం చేశాడు. ఆమె ఒప్పుకోక పోవడంతో ఈ ఏడాది మార్చి 11న ఇంట్లో యువతి ఒంటరిగా ఉన్న సమయంలో వచ్చి బలవంతంగా హెచ్‌ఐవీ రక్తాన్ని ఎక్కించాడు. అనంతరం మనోహర్ అక్కడ్నుంచి పారిపోయాడు. బాధిత యువతి విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పడంతో ఈ ఘటన సంచలనంగా మారింది. రమణి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు మనోహర్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, ఈ ఉదంతం మొత్తాన్ని అవమానకరంగా భావించిన యువతి శుక్రవారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు తీసుకుంది.

# కేబుల్ జర్నలిస్టులకు అక్రిడేషన్లు

**వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్న కమిషనర్**



**హైదరాబాద్, ఏప్రిల్ 10:** కేబుల్ న్యూస్ ఛానల్ జర్నలిస్టులు రాష్ట్ర,జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డులు పొందటానికి వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ సి హెచ్ ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నగర కేంద్రంగా స్టూడియోలు కలిగి, స్థానికంగా, జిల్లాలలో ప్రసారాలు అందించే చానళ్ళు రాష్ట్ర,జిల్లా స్థాయిలో కార్డులు పొందటానికి, జిల్లా స్థాయిలో స్టూడియోలు కలిగిన వారు ఆయా జిల్లాల్లో కార్డులు పొందటానికి నేరుగా ఈ నెల 17 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. దరఖాస్తులో ఛానల్ పేరు మరియు స్టూడియో అడ్రస్ తో పాటు, ఎమ్ ఐ బి సర్టిఫికెట్, లేబర్ లైసెన్స్, ఎం ఎస్ ఓ లతో చేసుకున్న ఛానల్ ప్లేస్మెంట్ అగ్రిమెంట్ల కాపీలను జతచేసి దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.అర్హత గల ఛానళ్లకు రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో అక్రిడేషన్స్ జారీ చేయబడతాయని వివరించారు.

# పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై కాంగ్రెస్ ఫోకస్

మొదటి పేజీ తరువాయి



ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఈ భేటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ కీలక సమావేశం ప్రారంభమైంది. ఈ భేటీకి కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్రనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. అనారోగ్య కారణాల దృష్ట్యా సోనియా గాంధీ, సీనియర్ నేత పి. చిదంబరం వర్చువల్‌గా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సల్మాన్ ఖుర్షీద్, అంబికా సోనీ, సచిన్ పైలట్, భూపేశ్ బగేల్ తదితరులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కు ఈ సమావేశంలో పాల్గొని తమ రాష్ట్రాల నివేదికలను సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధానంగా ఈ క్రింది అంశాలపై తన వాణిని వినిపించాలని నిర్ణయించింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరిని ఖరారు చేయనుంది. ఓబీసీ మహిళలకు ఉప కోటా కల్పించాలనే డిమాండ్‌పై కూడా చర్చించారు. 2026 తర్వాత జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై సీఎంలు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య తమ వాదనలు వినిపించారు. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు, భారతదేశంపై వాటి ప్రభావం, భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై చర్చించారు. కేవలం మూడు రోజుల పాటు జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోయే బిల్లులను ఎలా అడ్డుకోవాలి లేదా చర్చలో ఎలా పైచేయి సాధించాలనే అంశంపై సభ్యులకు కాంగ్రెస్ అగ్రనేతలు దిశానిర్దేశం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నరేంద్రమోదీ ప్రభుత్వం అనూహ్యంగా ప్రత్యేక సమావేశాలను పిలవడంతో ఈ అఖిల భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా తెలంగాణ వంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పార్టీ బలోపేతంపై సీఎం రేవంత్‌రెడ్డి సీడబ్ల్యూసీ సమావేశంలో కీలక ప్రసంగం చేసే అవకాశం ఉంది. సీడబ్ల్యూసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఎన్నికల ప్రయోజనాల కోసమేనని చెప్పారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎటువంటి ప్రతిపాదన కాంగ్రెస్ ముందుకు రాలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలోనే మహిళా రిజర్వేషన్లపై స్పష్టతని ఇచ్చామని, కేంద్రాన్ని డిమాండ్ కూడా చేశామని ప్రస్తావించారు. వెస్ట్ బెంగాల్, తమిళనాడు ఎన్నికలు జరుగుతున్న వేళ హఠాత్తుగా మహిళా రిజర్వేషన్ల బిల్లు సవరణ , పునర్విభజన చట్టం సవరణ బిల్లులను తెరపైకి తీసుకువచ్చారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక అఖిలపక్ష సమావేశం పెట్టాలని పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీలన్నీ కోరాయని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం తమ ప్రయోజనాల కోసం ప్రయత్నం చేస్తుందని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

# పొన్నాల ఎక్కడున్నారో తెలుసా?

మొదటి పేజీ తరువాయి



ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జీవన్ రెడ్డి తనపై చేసిన వ్యక్తిగత విమర్శలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. "జీవన్ రెడ్డి వ్యాఖ్యలపై నేను ప్రత్యేకంగా స్పందించను. కాంగ్రెస్ ఎప్పుడూ తన నేతలను గౌరవిస్తుంది. కానీ కొందరు కావాలని చేస్తున్న విమర్శలకు కాలమే సమాధానం చెబుతుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. సీనియర్లకు అవమానం జరుగుతోందని అంటున్న వారు, గతంలో బీఆర్ఎస్ నుంచి సీనియర్ నేతలు ఎందుకు బయటకు వచ్చారో ఒకసారి ఆలోచించాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య బీఆర్ఎస్‌లో చేరాక ఇప్పుడు ఎక్కడున్నారో, ఆయనకు అక్కడ దక్కిన గౌరవం ఎంతో అందరికీ కనిపిస్తూనే ఉందని ఎద్దేవా చేశారు. ఒకప్పుడు పార్టీ కోసం రక్తం చిందించిన ఆళ్ల నరేంద్ర, విజయశాంతి, ఈటల రాజేందర్ వంటి నేతలు బీఆర్ఎస్‌ను ఎందుకు వీడాల్సి వచ్చింది? అక్కడ వారికి జరిగిన అవమానం ఏంటో తెలంగాణ సమాజానికి తెలుసని సీఎం అన్నారు. బీఆర్ఎస్ హయాంలో సీనియర్లను ఏ విధంగా అణిచివేశారో గుర్తులేదా? అని ప్రశ్నించిన రేవంత్ రెడ్డి, కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఉంటుందని స్పష్టం చేశారు. స్వల్ప విభేదాలు ఉన్నప్పటికీ, పార్టీ ప్రయోజనాలే పరమావధిగా అందరూ కలిసి పనిచేయాలని, కావాలని చేస్తున్న విమర్శలను పట్టించుకోవాల్సిన పని లేదని ఆయన తేల్చి చెప్పారు.

# అన్నా.. నన్ను దేవుడే పంపిండు..

మొదటి పేజీ తరువాయి



తాజా రాజకీయాలు, కాంగ్రెస్ తీరును ఆయన కెసిఆర్‌తో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి తొలిసారి వచ్చిన జీవన్ రెడ్డిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డా. కె.సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.' తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్ల కైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది' అంటూ మనసులోని మాటను వ్యక్తం చేశారు. ఈ సంద్భంగా జీవన్‌రెడ్డిని కేసీఆర్ సన్మానించారు. జీవన్ రెడ్డి కూడా కెసిఆర్‌కు శాలువా కప్పి సన్మానించారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా ఉండి, తెలంగాణ తనానికి దర్పణంగా నిలిచే జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం, కేసీఆర్‌ను 'అన్నా' అని సంబోధిస్తూ భావోద్వేగానికి లోనవ్వడం చూస్తుంటే.. రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు సంభవించబోతున్నాయని స్పష్టమవుతోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ఈ చేరిక ఒక పెద్ద ఊతమివ్వనుంది.

# డీజీపీ ఎదుట లొంగిపోయిన కేశాలు

**మొత్తం 42 మంది ఆయుధాలతో లొంగుబాటు**

**వారికి పునరావాసం కల్పిస్తామన్న శివధర్ రెడ్డి**



**హైదరాబాద్, ఏప్రిల్ 10:** తెలంగాణ పోలీసుల ఎదుట మావోయిస్టు అగ్రనేత, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ డిప్యూటీ కమాండర్ సోడిమల్ల కేశాలు లొంగిపోయారు. అతనితోపాటు మొత్తం 42 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారు. ఛత్తీస్‌గఢ్- తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల నుంచి వచ్చి వీరంతా లొంగిపోయారు. ములుగు, భూపాలపల్లి మీదుగా పోలీసుల వద్దకు వెళ్లి లొంగిపోతున్నట్లు ప్రకటించారు.అనంతరం సరిహద్దుల నుంచి పోలీసులు వీరిని వాహనాల్లో హైదరాబాద్‌కు తరలించారు. మావోయిస్టు నేత హిడ్మా గెరిల్లాను వదిలి దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీకి వెళ్లిన తర్వాత బెటాలియన్ బాధ్యతలను బడ్సే దేవాకు, కేశాలుకు అప్పగించారు. అయితే, కొన్ని రోజులు కిందటే కమాండర్ దేవా.. తెలంగాణ పోలీసుల ఎదుట లొంగుపోయారు. ఆ తర్వాత బెటాలియన్ బాధ్యతలు నిర్వహిస్తున్న సోడిమల్ల కేశాలు సైతం తాజాగా శుక్రవారం లొంగిపోయారు. ఇతనికి సోడిమల్ల అలియాస్ కేశాలు అలియాస్ నిఖిల్ వంటి పేర్లున్నాయి. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు.మొత్తం 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోయినట్లు తెలిపారు. వీరిలో గెరిల్లా బెటాలియన్ కమాండర్ సోడిమల్ల అలియాస్ కేశాలు అలియాస్ నిఖిల్ ఉన్నారని వెల్లడించారు. తెలంగాణ పోలీసుల ఎదుట ఆయుధాలు, బంగారంతో లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసినట్లు చెప్పారు. 36 తుపాకులు, ఐదు ఏకే 47లు, నాలుగు ఎస్‌ఎల్‌ఆర్‌లు, 1,007 తూటాలతో పోలీసులు ముందు మావోలు లొంగిపోయినట్లు పేర్కొన్నారు. అలాగే 800 గ్రాముల బంగారం సైతం అప్పగించినట్లు వెల్లడించారు. వీరి లొంగుబాటుతో అత్యంత కీలకమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ పూర్తిగా కనుమరుగైనట్లు డీజీపీ శివధర్ రెడ్డి ప్రకటించారు.గత ఏడాదిన్నర కాలంలో 763 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా డీజీపీ ఎదుట లొంగిపోయారు. వీరిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ కేశాలు కూడా ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ పెరగడంతో మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయించారు. లొంగిపోయిన వారిలో ఒక్కరు మాత్రమే తెలంగాణకు చెందివారు కాగా.. ఎక్కువమంది ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే. 'లొంగిపోయిన వారికి పునరావాస ప్యాకేజీ కింద రూ.1.93 కోట్లు అందజేస్తున్నాం. సీఎం ఆదేశాల మేరకు ఆరోగ్యకార్డులు అందజేస్తాం. తెలంగాణకు చెందిన వాళ్లు సెంట్రల్ కమిటీలో 11 మంది ఉండేవారు. ఇప్పుడు ఇద్దరున్నారు. స్టేట్ కమిటీలో తెలంగాణ వాళ్లు 24 మంది ఉండేవారు. ఇప్పుడు ఇద్దరే ఉన్నారు. వాళ్లు కూడా లొంగిపోవాలని పిలుపునిస్తున్నాం అని డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నారు.



నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI


# కాళేశ్వరాన్ని రెండేళ్లుగా ఎందుకు నానబెట్టారు

- ఇప్పుడే రిపేర్లు చేయడంలో ఆంతర్యం ఏమిటో
- గతంలోనే చేసివుంటే రైతులకు మేలు జరిగేది
- కేవలం కమీషన్ల కోసమేనేమోనన్న అనుమానాలు
- రియల్ ఎస్టేట్ కోసమే ఫ్యూచర్ సిటీ జపం
- జిహెచ్ఎంసిలో తీవ్ర అవినీతి జరుగుతోంది
- మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్, ఏప్రిల్ 10:** కాళేశ్వరాన్ని వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. రెండున్నరేళ్లు దారుణంగా వ్యవహరించి పంటలు ఎండబెట్టారని ఆరోపించారు. ఇప్పటికే ఈ న ఇర్ణయం తీసుకుని ఉంటే రైతులకు మేలు జరిగి ఉండేదని అన్నారు. హైదరాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ..కమీషన్ల కోసమే ఇప్పుడు కాళేశ్వరానికి మరమ్మతులు అంటున్నారని మండిపడ్డారు. మున్సిపల్, అర్బన్ ఫారెస్ట్రీలో తీవ్రమైన అవినీతి జరుగుతోందన్నారు. రియల్ ఎస్టేట్ కోసం ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాద్‌కు నష్టం చేయవద్దని కోరారు. అలాగే జీహెచ్ఎంసీలో తీవ్ర అవినీతి జరుగుతోందని కవిత ఆరోపించారు. అనేక గ్రామాలు జీహెచ్ఎంసీ పరిధిలో కలిసినా సరైన అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. హెచ్ఎండీఏ పరిధిలో 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టారని తెలిపారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ అభివృద్ధికి ఉపయోగించలేదని కవిత ఆరోపించారు. హెచ్ఎండీఏకు చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని గుర్తు చేశారు. 2017 నుంచి 2021 వరకు 480 కోట్ల రూపాయల పనులను నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని కవిత తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత మరో 1,140 కోట్ల రూపాయలను అదే పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని వెల్లడించారు. ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. రూ.50 కోట్ల టెండర్ వేస్తే దాదాపు 50 శాతం తిరిగి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని.. కానీ నామినేషన్ పద్ధతిలో ఇలాంటి లాభం లేకపోవడం అవినీతికి దారితీస్తోందని ఆరోపించారు. నర్సరీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న 6 వేల మంది స్కిల్డ్ లేబర్‌కు 23,800 రూపాయలు ఇవ్వాల్సి ఉందని కవిత తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో ఒక కంపెనీపై సీఎం రేవంత్ రెడ్డి సిట్ వేయించారని.. తర్వాత ఏమైందో తెలియాలని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డులో గత ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్టును రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక కూడా కొనసాగిస్తున్నారని విమర్శించారు. దీనిపై ఆరోపణలు చేసిన రేవంత్ దీనిని ఎలా కొనసాగిస్తారని అన్నారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌పై ముఖ్యమంత్రి దృష్టి పెడుతున్నారని.. సీఎం దగ్గర బ్యాగులు మోసే వ్యక్తి చెప్పినట్టు మాత్రమే పనులు జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. జీహెచ్ఎంసీ అంటే గుంపు మేస్త్రి పాలనలో జరుగుతున్న మహా అవినీతి అని వ్యాఖ్యానించారు. అవినీతి కోసమే సీఎం 'ఫ్యూచర్ సిటీ' అంటున్నారని కవిత అన్నారు. నెల 25వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 21 కమిటీలు వేశామని కవిత చెప్పారు. 500 మంది వలంటీర్లు సేవలు అందిస్తారని తెలిపారు. మహిళా బిల్లు అమలు కాకపోవడంతో 12 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు నష్టపోయారని చెప్పారు. 2027 జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. ధర్మపురి అరవింద్‌లో పురుష అహంకారం కనిపిస్తోందని.. ప్రజలు ఆయన్ను ఎప్పుడో మర్చిపోయారని కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నాను... ఎవరో చెప్తే పార్టీ పెట్టే స్థాయిలో లేను' అని కవిత స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను కేరళం ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని తాము వీడియో రిలీజ్ చేశామని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

# పేదల ప్రభుత్వంపై ప్రతిపక్షాల బురద రాజకీయం

- వారికంటిన బురదను మాకు అంటించే ప్రయత్నం
- సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం, ఏప్రిల్ 10:** ప్రతిపక్షానికి చెందిన కొంతమంది వారికి అంటిన బురదని అధికార పార్టీకీ, అధికార పార్టీ నాయకులకు అంటించాలని చూస్తున్నారని ఎవరు ఎన్ని కారుకూతలు కూసినా భవిష్యత్తు లో ఇందిరమ్మ ప్రభుత్వంని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం నాడు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో 1.52 కోట్లతో నిర్మించిన ప్యాక్స్ గోదాములను ప్రారంభించారు. అలాగే మండలంలో 191 మంది లబ్దిదారులకు మంజూరైన రూ. 58.58 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలిన ఈ ప్రభుత్వం పేదవారికి అండగా ఉంటుందన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ధాన్యం కొన్న వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రైతును రాజు చేయడమే ప్రభుత్వ ప్రధాన సంకల్పమని పేర్కొన్నారు. కేవలం నాలుగు నెలల్లోనే రూ. 20,670 కోట్ల మేర రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించామని ఏడాదికి ఎకరానికి రూ. 12 వేలు అందిస్తూ, సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త గా 3.80 లక్షల మందికి పాస్ పుస్తకాలను అందజేశామన్నారు. ధరణి తో రైతులు ఇబ్బందులు పడ్డారని దాన్ని బంగాళాఖాతంలో వేసి భూ భారతి తీసుకొచ్చామని తెలిపారు. అనంతరం వెంకటాపురంలో దేవంగి శ్రీకాంత్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న మంత్రి.. అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, పాలేరు ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి పుల్లయ్య, తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తదుపరి డీజీపీగా సీవీ ఆనంద్?

## ప్రభుత్వ పరిశీలనలో ఆయన పేరు



**హైదరాబాద్, ఏప్రిల్ 10:** తెలంగాణ రాష్ట్రానికి కొత్త పోలీస్ బాస్ నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. 1991వ బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ తెలంగాణ రాష్ట్ర తదుపరి పూర్తిస్థాయి డీజీపీగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో ఇన్-చార్జ్ డీజీపీగా కొనసాగుతున్న బి. శివధర్ రెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ చేయనుండటంతో, ఆ స్థానంలో శాశ్వత ప్రాతిపదికన కొత్త అధికారిని నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నియామకం కోసం రాష్ట్రం పంపిన ఐదుగురు అధికారుల జాబితాను పరిశీలించిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ , ముగ్గురు అధికారులతో కూడిన ప్యానెల్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఆ జాబితాలో సీవీ ఆనంద్‌తో పాటు కేంద్ర ఇంటలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్‌గా ఉన్న వినాయక ప్రభాకర్ ఆప్టే , తెలంగాణ జైళ్ల శాఖ డీజీగా ఉన్న సౌమ్య మిశ్రాల పేర్లు ఉన్నాయి. అయితే, ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పేరు ఈ సిఫార్సు జాబితాలో లేకపోవడంతో ఆయన పదవీ విరమణ అనివార్యం కాగా, సీనియారిటీ , రాష్ట్రంలో సుదీర్ఘ కాలం వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం దృష్ట్యా సి.వి. ఆనంద్ పేరుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. గతంలో రెండుసార్లు డీజీపీ పదవికి ఆయన పేరు పరిశీలనలోకి వచ్చినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల అవకాశం దక్కలేదు, కానీ ఈసారి సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం శాశ్వత ప్రాతిపదికన ఆయన నియమితులయ్యే అవకాశం ఉంది. ఈ నియామకానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఈ నెల 14వ తేదీ తర్వాత వెలువడే సూచనలు కనిపిస్తున్నాయి. ఒకవేళ సీవీ ఆనంద్ బాధ్యతలు చేపడితే, ఆయన పదవీ కాలం 2028 మే వరకు ఉంటుంది. మరోవైపు, మహిళా అధికారులకు కూడా ప్రాధాన్యత ఇస్తూ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఒక మహిళా డీజీ స్థాయి అధికారిని నియమించాలని ప్రభుత్వం యోచిస్తోంది. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఏప్రిల్ 13 నాటికి డీజీపీ నియామకంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉండటంతో, త్వరలోనే రాష్ట్ర పోలీస్ శాఖలో ఈ కీలక మార్పు చోటుచేసుకోనుంది.

## లెబనాన్‌లపై దాడుల్లో పౌరుల మృతిపై

# భారత్ ఆందోళన

## దేశ ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం

## గల్ఫ్ దేశాలతో చర్చలకు కేంద్రమంత్రులు

## విదేశాంగ శాఖ కార్యదర్శి రణ్‌ధీర్ జైస్వాల్ వెల్లడి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్ర మంత్రులు గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తున్నారని విదేశాంగ శాఖ కార్యదర్శి రణ్‌ధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఈ మేరకు ఖతార్‌తో ఒప్పందం చేసుకొనేందుకు చర్చలు కొనసాగుతున్నాయన్నారు. అదే సమయంలో పొరుగు దేశాల ఇంధన అవసరాలనూ తీర్చడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రెండు వారాల క్రితం భారత్.. శ్రీలంకకు 38 మెట్రిక్ టన్నుల పెట్రోలియం ఉత్పత్తులను సరఫరా చేసినట్లు వెల్లడించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు దేశ ఇంధన భద్రతను పటిష్టం చేసేందుకు మంత్రులు గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తున్నారని చెప్పారు. విదేశాంగ మంత్రి ప్రస్తుతం మారిషస్‌లో ఉన్నారని, అక్కడి నుంచి 11,12 తేదీల్లో యూఏఈలో పర్యటిస్తారని తెలిపారు. భారత్-యూఏఈ సంబంధాల బలోపేతంపై అక్కడి నాయకులతో చర్చిస్తారని అన్నారు. పెట్రోలియం మంత్రి సైతం ప్రస్తుతం ఖతార్‌లో పర్యటిస్తున్నట్టు చెప్పారు. భారత్‌కు నమ్మకమైన ఇంధన సరఫరాదారుగా ఉన్న ఖతార్ సైతం భారత్‌తో ఇందన సహకారానికి కట్టుబడి ఉన్నట్టు తెలిపిందని వివరించారు. ప్రస్తుత ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ సముద్ర జలాల్లో చిక్కుకుపోయిన భారత నావికులను సురక్షితంగా స్వదేశానికి తీసుకుని రావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశంలో ఎల్‌పీజీ, పెట్రోల్ ఇతర ఇంధన నిల్వలకు ఎటువంటి కొరతా లేదని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ పేర్కొన్నారు. పెట్రోల్ బంకులలో తగినంత నిల్వలు ఉన్నాయని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా సాధారణంగానే ఉందన్నారు. ఇకపోతే లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న వైమానిక దాడులపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ దాడుల్లో పెద్ద సంఖ్యలో పౌరులు మరణించినట్టు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నట్టు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఉద్రిక్తలు తగ్గించి సంయమనం పాటించాలని కోరింది. అంతర్జాతీయ చట్టాల గౌరవం, పౌరుల రక్షణ అత్యంత ముఖ్యమని స్పష్టం చేసింది. అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటికీ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. లెబనాన్ ఈ ఒప్పందం పరిధిలోకి రాదని ఇజ్రాయెల్ వాదిస్తోంది. లెబనాన్‌పై దాడులు ఆపకుంటే అమెరికాతో శాంతి చర్చల నుంచి వైదొలుగుతామని ఇరాన్ హెచ్చరిస్తోంది.'లెబనాన్‌పై దాడుల్లో పెద్దసంఖ్యలో పౌరులు మరణించినట్టు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. యూఎన్ఐఎఫ్ఐఎల్‌కు ట్రూప్ కంట్రిబ్యూటింగ్ దేశంగా లెబన్‌నాన్‌లో శాంతి, భద్రతలకు భారత్ ఎంతో వెచ్చిస్తోంది. జరుగుతున్న పరిణామాలు మాత్రం ఆందోళన కలిగిస్తున్నాయి. పౌరుల రక్షణ, అంతర్జాతీయ చట్టాలు, దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని కోరుతున్నాం . భారతదేశం ఎప్పుడూ పౌరుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. లెబనాన్‌లోని భారత పౌరుల భద్రతను అక్కడి ఇండియన్ ఎంబసీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది' అని విదేశాంగ శాఖ కార్యదర్శి రణ్‌ధీర్ జైశ్వాల్ మీడియా సమావేశంలో తెలిపారు. పశ్చిమాసియాలో పరిస్థితులను జాగ్రత్తగా గమనిస్తున్నామని, గల్ఫ్ ప్రాంతాల్లోని దేశాలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు సాగిస్తున్నామని జైశ్వాల్ తెలిపారు.



# రాష్ట్రపతి, ప్రధానితో గవర్నర్ భేటీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రపతి, ప్రధానులను కలుసుకున్నారు. తెలంగాణ గవర్నర్‌గా నియమితులు అయ్యాక ఆయన తొలిసారి ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ముర్మును కలసారు. తనను గవర్నర్‌గా నియమించి పనచేసే అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రధాని మోడీతో కూడా ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మోడీ గవర్నర్‌కు అభినందనలు తెలిపారు.

# 13 ఏళ్ల బాలికపై లైంగిక దాడి

**హైదరాబాద్, ఏప్రిల్ 10:** నగరంలోని కాచిగూడలో దారుణం చోటు చేసుకుంది. 13 ఏళ్ల బాలికపై 15 ఏళ్ల బాలుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో బాలికకు పరిచయమైన నిందితుడు.. ఆమెతో స్నేహం పెంచుకొని లైంగిక దాడి చేశాడు. ఈ కేసులో బాలుడిని అరెస్టు చేసిన పోలీసులు.. అతడిని జువైనల్ హోమ్‌కు తరలించారు.

# పిచ్చిగా వాగితే ఖబర్దార్

## అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లపై దుష్ప్రచారమా? : మండిపడ్డ మంత్రి సీతక్క



**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 10:** అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేయడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని స్త్రీ శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అన్నారు. అంగన్‌వాడీ అంటే అమ్మఒడి అంటూ సీతక్క అభివర్ణించారు. మినీ అంగన్వాడీలను కాంగ్రెస్ ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిందని.. ఆ టీచర్లకు ఇప్పుడు రూ.2 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్లు కూడా ఇస్తున్నామని పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు గతంలో సెలవులు కూడా ఉండేవి కాదని.. కాంగ్రెస్ సర్కార్‌లో వారికి సెలవులు ఇస్తున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసిన ఘనత మాజీ ప్రధాని, దివంగత ఇందిరా గాంధీకి దక్కుతుందని ప్రశంసించారు. మహిళా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో అంగన్వాడీ టీచర్లకు మంత్రి సీతక్క స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. స్మార్ట్ ఫోన్లు పంపిణీ సందర్భంగా తనపై వస్తున్న ఆరోపణలను సీతక్క ఖండించారు. తనపై కొంతమంది పిచ్చి వాగుడు వాగుతున్నారని ఆగ్రహించారు. అసత్య ప్రచారాలతో అబద్దాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సెల్ ఫోన్ల కొనుగోలుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆన్ లైన్ టెండర్లు వేసిందని.. ఎక్కడా అవినీతి జరగలేదన్నారు. కేంద్రం ఇచ్చిన గైడ్ లైన్ల ద్వారా మాత్రమే రూ.11,600 తక్కువ రేటుతో సెల్ ఫోన్లు ఇస్తున్నామని పేర్కొన్నారు.తమ ప్రభుత్వం ఫోన్లు కొన్నది రూ.11 వేలకే అయితే రూ.14 వేలకు కొన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని ఆగ్రహించారు సీతక్క. పేదలకు మంచి చేసే తమ లాంటి వాళ్ల మీద చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్న వారికి లీగల్ నోటీసులు ఇస్తామని మంత్రి హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పని చేసినా గత ప్రభుత్వ పాలకులకు నిద్రపట్టడం లేదని విమర్శించారు. నిజాలు ఉంటే నిరూపించాలని, అంతేగాని బట్ట కాల్చి మీద వేస్తామంటే ఉరుకునే పరిస్థితి లేదని మంత్రి సీతక్క హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

# అధ్వానంగా పాఠశాలలు

## రోజుకో బిడ్డ చనిపోతున్నా చలనం లేదు

## కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆర్ఎస్ ప్రవీణ్ విమర్శలు



**హైదరాబాద్, ఏప్రిల్ 10:** అసమర్థ కాంగ్రెస్ పాలనలో తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రతి వారం ఒక బిడ్డ చనిపోతుందని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ ప్రజల ఉసురు తీసుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రతి వారం ఒక ఆటో డ్రైవర్, ఆరుగురు రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. ప్రతి వారం 17 పాఠశాలలు మూత పడుతున్నాయి. కానీ ప్రతిరోజూ కాంగ్రెస్ పాలకులు రూ.25 కోట్లు వాళ్ల జేబుల్లో వేసుకుంటున్నారని విమర్శించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 373 ఎకరాల భూమిని నాదర్‌గుల్‌లో కబ్జా చేశారు. స్థానిక రైతులను ముప్పు తిప్పలు పెడుతున్నారు. అందుకే ప్రజలందరు మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. అవినీతి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

నేటి సాక్షి
కరీంనగర్ శనివారం 11 ఏప్రిల్ 2026




## సంపాదకీయం


## మహిళా బిల్లుతో పాటు సమాజ రుగ్మతలపైనా

# చర్చించాలి!

భారతదేశం స్వాతంత్ర్యం సముపార్జించి 80వ ఏట అడుగిడబోతున్నాం. సాధించిన విజయాలకన్నా అపజయాలే ఎక్కువగా చర్చించుకోవాలి. దేశంలో నేటికి సరైన విద్యావైద్యం అందడం లేదు. పేదలు పేదలుగానే జీవిస్తున్నారు. గృహవసతి అందని ద్రాక్షగా మారింది. విద్య డబ్బున్న వారికే అందుబాటులో ఉంది. విద్యకోసం మధ్యతరగతి, పేదలు అప్పులు చేయాల్సి వస్తోంది. సరైతన వైద్యం అందుబాటులోకి రావడం లేదు. కనీసం జిల్లాకో మంచి కార్పోరేట్ తరహా ఆస్పత్రి కట్టలేకపోయారు. ఫీజు రియంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలకు వేలకోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వాలు సొంతంగా ఆస్పత్రులను నిర్మించలేక పోతున్నాయి. అన్నింటికి మించి గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా వాడేస్తున్నారు. అత్యాచారాలకు లెక్కేలేదు. మహిళల భద్రత డొల్ల అని చెప్పకతప్పదు. అమ్మాయిల అపహరణ కేసులు పెరుగుతున్నాయి. సమజాన్ని పట్టిపపీడిస్తున్న ఈ సమస్యలపై నిరంతరం చర్చించాలి. నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి. ఈ క్రమంలో మహిళల రిజర్వేషన్లను ముందుకు తీసుకెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించేందుకు, ఆమోదిం చేందుకు ఏప్రిల్ 16న పార్లమెంటు సమావేశం కానుంది. దీనికి చట్టబద్ధత కల్పించడం ద్వారా చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు కానున్నాయి. దీంతో ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న మహిళా రిజర్వేషన్ల క ల సాకారం కానుంది. 2029 ఎన్నికల నుంచి ఇది అమల్లోకి రానుంది. భారత్‌లోని కోట్లాది మహిళల ఆకాంక్షలకు ఇది ప్రతిబింబంగా చూడాలి. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమి స్తుందనే మన సుదీర్ఘ నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనం. దేశ జనాభాలో దాదాపు సగం మంది మహిళలే ఉన్నా వారికి ఇన్నాళ్లూ చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం దక్కలేదు. ఈ దేశానికి వారు అందిస్తున్న సేవలు అపారమైనవే కాదు... అమూల్యమైనవి. కూడా. అయినా ఇంకా చిన్నచూపు చూస్తూనే ఉన్నారు. పిల్లను క నే యంత్రాలుగా భావిస్తున్నారు. నిజానికి ప్రతిరంగంలోనూ మహిళలు సాధిస్తున్న అద్భుతమైన విజయాలకు ఎందరో దిక్సూచిగా నిలిచారు. శాస్త్ర, సాంకేతిక రంగాల నుంచి ఔత్సాహిక పారిశ్రామిక రంగం వరకు, క్రీడల నుంచి రక్షణ బలగాల వరకు, సంగీతం నుంచి లలితకళల వరకు దేశాభివృద్ధిలో మహిళలే అగ్రగామిగా ఉన్నారు. కొన్నేళ్లుగా చేసిన ప్రయత్నాలు స్త్రీ సాధికారత దిశగా అనుకూల వాతావరణాన్ని సృష్టించాయి. చదువుకునేందుకు విస్తృతంగా పెరిగిన అవకాశాలు, మెరుగైన ఆరోగ్య సేవలు, విస్తరించిన ఆర్థిక సమ్మిళితత్వం, అందుబాటులోకి వచ్చిన ప్రాథమిక అవసరాలు..ఆర్థిక, సామాజిక కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యాన్ని విస్తృతం చేశాయి. అయినప్పటికీ.. సమాజంలో మహిళలు పోషిస్తున్న పాత్రకు అనుగుణంగా రాజకీయ రంగంలో, శాసనసభల్లో వారికి తగు ప్రాతినిధ్యం లభించలేదు. ఇది దురదృష్టకరం అని చెప్పుకోవాలి. దాదాపు 80 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం ఇప్పుడు ఈ కల సాకారం కాబోతున్నది. పరిపాలనలో, నిర్ణయాధికారంలో మహిళలు భాగస్వాములైతే.. వారిదైన ఆలోచనలనూ, అనుభవాలనూ జోడించడం ద్వారా ప్రజోపయోగ చర్చలు, పాలనా సామర్థ్యం మరింత మెరుగవు తాయనడంలో సందేహం లేదు. రిజర్వేషన్ల బల్లు ఆఆమోదం దక్కాక రానున్న అంటే... 2029లో లోక్‌సభ, వివిధ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగే నాటికి మహిళా రిజర్వేషన్లను అమలుచేయడం ఇక అనివార్యం కానుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళలకు దక్కాల్సిన ప్రాధాన్యాన్ని అందించేందుకు గత ప్రభుత్వాలు కూడా దశాబ్దాలుగా తమవంతు ప్రయత్నం చేస్తూ వచ్చాయి. కమిటీలు ఏర్పాటయ్యాయి. ముసాయిదా బిల్లులను ప్రవేశపెట్టారు. కానీ అవేవీ కార్యరూపం దాల్చలేదు. అయినప్పటికీ... చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో విస్తృత ఏకాభిప్రాయం వ్యక్తం అయింది. ఈ ఏకాభిప్రాయ స్ఫూర్తితోనే 2023 సెప్టెంబరులో నారీ శక్తి వందన్ అధీనియంను పార్లమెంటు ఆమోదించింది. భారత చరిత్రలో ఇదో సువర్ణాధ్యాయంగా చెప్పుకోవాలి. మహిళలను శక్తివంతంగా ఎదగడానికి ఇదో ప్రయత్నంగా చూడాలి. వారికి సమున్నత గౌరవం ఇచ్చే చర్యగా భావించాలి. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ అవకాశం మన రాజ్యాంగ స్ఫూర్తికి నిదర్శనంగా చూడాలి. ఓ రకంగా ప్రపంచ దేశాలతో పోలిస్తే మనం ఎంతో ముందున్నామని చెప్పుకోవాలి. ఆచరణాత్మక రూపంలో సమానత్వానికి ప్రాతినిధ్యం ఉన్న సమాజాన్ని నిర్మించాలన్న మన రాజ్యాంగ నిర్మాతల ఆకాంక్షలను నెరవేర్చడంలో భాగంగా చేపడుతున్న ఈ ప్రయత్నం నిజంగా అభినందించదగ్గదే. శాసనవ్యవస్థల్లో మహిళల పాత్రను బలోపేతం చేయడం అంటే వారిని మనం గౌరవించుకోవడమే. వారి శక్తిని దేశానికి ఉ పయోగించడమే అవుతుంది. ఒక ఇంటిని ఎలా అయితే మహిళ నిర్మిస్తుందో, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రతి మహిళకు సమాన భాగస్వామ్యాన్ని అందించే సమాజాన్ని నిర్మించడంలో మనమంతా అవకాశం ఇవ్వాలి. నిజానికి ఇది ఎప్పుడో జరగాల్సిన సత్కార్యం. మహిళల ప్రాతినిధ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఇప్పటికే జాప్యం జరిగింది. శాసన వ్యవస్థల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని దశాబ్దాల కిందటే గుర్తించినా అడుగు ముందుకు వేయలేదు. ఈ అంశంపై చర్చించారు తప్ప చట్టం చేయలేదు. జనాభాలో సగ భాగంగా ఉన్న వారి ఆకాంక్షలను మన శాసన వ్యవస్థలు ప్రతిబింబించాల్సిన అవసరం ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు లభించే ఆమోదంలో విస్తృత ఏకాభిప్రాయం ముఖ్యం. ఇక్కడ శశభిషలకు తావు లేకుండా ఏకగ్రీవంగా పార్లమెంట్ దీనిని ఆమోదించి తీరాలి. జాతీయ ప్రయోజనాలే పరమావధి అన్న సంకల్పంతో ముందుకు సాగాలి. భారతీయ మహిళల కోసం చేపడుతున్న ఈ ముఖ్యమైన కార్యక్రమానికి మద్దతు అందించాల్సి బాధ్యత అన్న పార్టీలకు ఉంది. ఇకపోతే ఇదే సందర్భంలో దేశాన్ని పట్టిపీడిస్తున్న కొన్న రుగ్మతలనైనా రూపుమాపేందుకు చర్చించాలి. దేశంలో వేళ్లూనుకు పోయిన కులవ్యవస్తపై చర్చంచాలి. కులాల వారీగా రిజర్వేషన్లు అనేవి ఉన్నా..కులాల ఉమ్ములాటలు ఆగడం లేదు. దేశ ప్రజలంతా సమానమే అన్న భావన రావాలంటే కుల వ్యవస్థను కూకటివేళ్లతో పెరికివేయాలి. ఈ విషయంపైనా ఇటీవల పలువురు ప్రముఖులు చర్చ లేవనెత్తారు. రాజకీయ పార్టీలు దూరదృష్టితో ఆలోచిస్తే..ఇదేమంత పెద్ద సమస్య కాబోదు.

# నేడు ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు

- నగరంలో రెడ్ అలర్ట్ ప్రకటన
- భారీగా బందోబస్తు ఏర్పాటు




**ఇస్లామాబాద్, ఏప్రిల్ 10:** అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించినా.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మాత్రం తొలగిపోలేదు. సీజ్‌ఫైర్ వేళ.. శాంతి చర్చలకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. ఏప్రిల్ 11న శనివారం రాజధాని ఇస్లామాబాద్‌లో ఈ చర్చలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ హై అలర్ట్‌లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వ భవనాలు, కీలక రహదారి మార్గాల వద్ద భద్రతా బలగాలు పహారా కాస్తున్నాయి. రాజధానిలోని రెడ్‌జోన్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రత కొనసాగుతోంది. అక్కడ పరిమిత సంఖ్యలోనే జనసంచారం కనిపిస్తోంది. ఇస్లామాబాద్‌లో దేశ పార్లమెంట్, కీలక ప్రభుత్వ కార్యాలయాలు, లగ్జరీ హోటళ్లు, ఎంబసీలు, విదేశీ సంస్థల కార్యాలయాలున్న ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా పిలుస్తారు. ఈ చర్చల నేపథ్యంలో గురువారం, శుక్రవారం ఇస్లామాబాద్‌లో సెలవు ప్రకటించారు. దుకాణాలు మూతపడ్డాయి. తమ మధ్యవర్తిత్వంతోనే రెండు వారాల పాటు కాల్పుల విరమణ జరిగిందని చెప్పిన పాకిస్థాన్ (ఖజీతిబబిజీని).. ఇప్పుడు ఇరుదేశాల మధ్య శాంతిచర్చలకు ఆతిథ్యం ఇస్తోంది. ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ నేతృత్వంలోని బృందం అమెరికా తరపున చర్చల్లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఇక ఇరాన్ వైపు నుంచి విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ పాక్ బయల్దేరారంటూ అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ వార్తలను ఇరాన్ ఖండించింది. వారిద్దరూ తమ రాజధాని టెహ్రాన్‌లోనే ఉన్నారని చెప్పింది. ఒకవేళ చర్చలంటూ జరిగితే.. హర్మూజ్‌పై నియంత్రణ, తమ దేశంపై ఉన్న ఆంక్షల నుంచి ఉపశమనం, తన మిత్రపక్షాలపై దాడులు చేయకూడదంటూ 10 పాయింట్ల డిమాండ్ల పైనే ఇరాన్ పట్టుబట్టే అవకాశం ఉంది. ఇక, లెబనాన్‌లోని ఇరాన్ మిత్రపక్షం హెజ్‌బొల్లా గ్రూప్‌పై ఇజ్రాయెల్ దాడులు మాత్రం ఆగడం లేదు. సీజ్ ఫైర్ ప్రకటన తర్వాతే అక్కడ మారణహోమం సృష్టించింది. అమెరికా-ఇరాన్ మధ్య ఉన్న అపనమ్మకం, ఇజ్రాయెల్ దూకుడు కారణంగా ఈ చర్చల్లో పురోగతిని ఆశించలేమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



# హరివంశ్ నారాయణ సింగ్‌కు మరో ఛాన్స్


- రాష్ట్రపతి కోటాలో నామినేట్ చేసిన కేంద్రం
- మరోమారు డిప్యూటీ చైర్మన్ అయ్యే అవకాశం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ కొనసాగే అవకాశముంది. అనుభవజ్ఞుడైన నాయకుడిగా, నిష్పక్షపాతంగా సభను నడిపించే సమర్థత కలిగిన వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది. భారత పార్లమెంట్ ఎగువసభలో అత్యంత హుందా తనం గల నేతగా పేరుగాంచిన హరివంశ్.. మరోసారి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగబోతున్నారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ పదవీ విరమణతో ఏర్ప డిన ఖాళీని భర్తీ చేస్తూ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనను నామినేట్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 80 ప్రకారం.. సాహిత్యం, శాస్త్రం, కళలు, సామాజిక సేవ వంటి రంగాల్లో విశేష కృషి చేసిన 12 మందిని రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేస్తారు. హరివంశ్ తన కున్న సుదీర్ఘ జర్నలిజం అనుభవం, సామాజిక స్పృహతో ఈ కోటాలో ఎంపికయ్యారు. బిహార్ నుంచి జేడీయూ తరఫున ఎన్నికైన ఆయన సభ్యత్వ కాలం ఏప్రిల్ 9వ తేదీన ముగిసింది. సాధారణంగా పార్టీ కోటాలో సభ్యత్వం ముగిసిన తర్వాత తిరిగి పార్టీ టికెట్‌పైనే వస్తుంటారు. కానీ, కేంద్ర ప్రభుత్వం ఆయన సేవలను ప్రత్యేకంగా గుర్తించి రాష్ట్రపతి కోటా ద్వారా నేరుగా సభకు పంపడం గమనార్హం. రాజ్యసభ 13వ డిప్యూటీ ఛైర్మన్‌గా ఆయన పనిచేసిన తీరు అమోఘం. క్లిష్టమైన బిల్లుల చర్చ సమయంలో సభలో గందరగోళం నెలకొన్నప్పుడు, ఆయన చూపిన ప్రతిభ, నిష్పక్షపాత నిర్ణయాలు అధికార, ప్రతిపక్షాల మన్ననలు పొందాయి. హరివంశ్ నారాయణ్ సింగ్‌ను మళ్లీ సభకు పంపడం వెనుక కేంద్ర ప్రభుత్వం కొన్ని కీలక వ్యూహాలను రచించినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎగువ సభలో ప్రతిపక్షాల బలం గణనీయంగా ఉన్నప్పుడు, సభను సమర్థవంతంగా నడపగలిగే వ్యక్తుల అవసరం ప్రభుత్వానికి ఉంటుంది. హరివంశ్ ఆ విషయంలో ఇప్పటికే తన సత్తా చాటారు. తాజా నామినేషన్‌తో ఆయన మళ్లీ రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యే అవకాశముంది. నామినేటెడ్ సభ్యుడిగా ఉ ంటూ ఈ బాధ్యతలు చేపడితే, అది సభకు మరింత గౌరవాన్ని తెస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. సీనియర్ జర్నలిస్టుగా హరివంశ్‌కున్న విలువలు, రాజకీయాలకు అతీతంగా ఆయనకు ఉన్న ఆదరణ ప్రభుత్వానికి సానుకూల అంశమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రాజకీయాల్లో హుందాతనం తగ్గుతున్న కాలంలో, హరివంశ్ నారాయణ్ సింగ్ వంటి సీనియర్ల సేవలను వినియోగించుకోవడం ప్రజాస్వామ్యానికి శు భపరిణామమని తెలిపారు. రంజన్ గొగొయ్ స్థానంలో ఓ అనుభవజ్ఞుడైన పార్లమెంటేరియన్ రావడం సభ గౌరవాన్ని మరింత పెంచుతుందనడంలో సందేహం లేదని పేర్కొన్నారు. హరివంశ్ నారాయణ్ సింగ్ మళ్లీ డిప్యూటీ చైర్మన్ బాధ్యతలు చేపడితే.. సభలో చర్చల నాణ్యత మరింత మెరుగుపడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# కాలిన నోట్ల కట్టల వ్యవహారం

## జస్టిస్ యశ్వంత్ వర్మ రాజీనామా



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపారు. ఢిల్లీలోనితన నివాసంలో కాలిన నోట్ల కట్టలు దొరికిన ఘటనలో ఆయనను తొలగించేందుకు అభిశంసన పక్రియకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. గతేడాది మార్చి 14న ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న సమయంలో జస్టిస్ వర్మ నివాసంలో భారీగా నోట్ల కట్టలు బయటపడటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీని ఫలితంగా 2025 జులైలో లోక్‌సభలో 145 మంది, రాజ్యసభలో 63 మంది ఎంపీలు ఆయనపై అభిశంసన తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. దీంతో లోక్‌సభ స్పీకర్ ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఏర్పాటును జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అయితే, ఆయన పిటిషన్‌ను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. అంతకుముందు సుప్రీంకోర్టు అంతర్గత కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేసినా ఆయనకు చుక్కెదురైన విషయం తెలిసిందే. దీంతో ఇక లాభం లేదనుకుని ఆయన రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

# రాజ్యసభ సభ్యుడిగా నితీశ్ ప్రమాణం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శుక్రవారం రాజ్యసభ సభ్యునిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ సి.పి రాధాకృష్ణన్ తన ఛాంబర్‌లో నితీష్‌కుమార్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. నితీష్‌కుమార్ హిందీలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, రాజ్యసభ నేత జెపి నడ్డా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌లు హాజరయ్యారు. అలాగే జెడియు నేత, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజరు కుమార్ ఝా, కాంగ్రెస్ నేత జైరాం రమేష్, బిజెపి ఎంపి మాజీ కేంద్రమంత్రి అయిన రాజీవ్ ప్రతాప్ రూడీ తదితరులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్‌డిఎ తదుపరి బీహార్ సిఎం ఎవరనేది త్వరలోనే వెల్లడించనుంది. బహుశా ఏప్రిల్ 14న కొత్త ముఖ్యమంత్రిని ఎన్‌డిఎ ఎన్నుకునే అవకాశం ఉంది.

# ముంబై ఎయిర్‌పోర్టులో 29 కిలోల బంగారం సీజ్

## కెన్యా నుంచి వస్తున్న మహిళల నుంచి స్వాధీనం

**ముంబై, ఏప్రిల్ 10:** ముంబై ఎయిర్‌పోర్ట్‌లో 29 కిలోల బంగారాన్ని డీఆర్‌ఐ అధికారులు సీజ్ చేశారు. దీని విలువ సుమారు రూ.38 కోట్లు ఉ ండొచ్చని అధికారులు చెబుతున్నారు. కెన్యాలోని నైరోబీ నుంచి ఈ బంగారాన్ని అక్రమంగా తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. ముంబై విమానాశ్రయంలో భారీ ఎత్తున బంగారాన్ని అక్రమంగా తీసుకొస్తున్నారని డీఆర్‌ఐ అధికారులకు సమాచారం అందింది. దీంతో వెంటనే వారు అప్రమత్తమయ్యారు. ఆపరేషన్ ధహాబు పేరుతో విమానాశ్రయంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కెన్యాలోని నైరోబీ నుంచి వచ్చిన ప్రయాణికులను తనిఖీ చేయగా.. బంగారం బయటపడింది. కెన్యాకు చెందిన మహిళలు దు-స్తులు, బ్యాగుల్లో సుమారు 29 కిలోల బంగారాన్ని దాచినట్లు గుర్తించారు. బంగారాన్ని సీజ్ చేసిన అధికారులు.. మొత్తం 26 మంది కెన్యా దేశస్థులను అరెస్ట్ చేశారు. విమానాశ్రయంలోని గ్రీన్ ఛానల్ దాటిన తర్వాత.. అధికారులను చూసి పారిపోతుండగా.. అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పట్టుకున్న బంగారం విలువ సుమారు రూ.38 కోట్లు ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు.



## ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా కోరుట్ల మున్సిపాలిటీ కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. మున్సిపల్ కమిషనర్ రవీందర్ ఆదేశాల మేరకు పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడుతున్న వ్యాపారులకు మొత్తం రూ. 12,000 జరిమానా విధించారు. కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలతో పాటు దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వ్యాపారులు తమ వద్ద ఉత్పన్నమయ్యే చెత్తను తడి, పొడి మరియు హానికరమైనదిగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకే అందించాలని సూచించారు. ట్రేడ్ లైసెన్సులు లేని వారు వెంటనే పునరుద్ధరించుకోవాలని తెలిపారు. పర్యావరణానికి మేలు చేసే బట్ట సంచులను వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, అశోక్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మానస దేవి గుడికి బంగారు తూకం



**నేటి సాక్షి,గన్నేరువరం,(బుర్ర అంజయ్య గౌడ్):** మండల కేంద్రంలోని మానస దేవి ఆలయానికి ఇండియన్ బ్యాంక్ గన్నేరువరం శాఖ ఆధ్వర్యంలో బంగారు ఆభరణాలను తూకం వేసే ఎలక్ట్రానిక్ కాంటా మెషిన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఇండియన్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తులు సమర్పించే బంగారు కానుకల బరువును కచ్చితంగా, సులభంగా కొలిచేందుకు ఈ యంత్రం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంపై ఆలయ కమిటీ చైర్మన్ చంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. భక్తులకు మరియు ఆలయ నిర్వహణకు ఈ మెషిన్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. బ్యాంక్ అధికారులు సామాజిక బాధ్యతతో స్పందించి ఈ పరికరాన్ని అందించినందుకు ఆలయ కమిటీ సభ్యులు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది మరియు ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## చిత్తనూరులో బెల్ట్ షాపుల దందా

### పట్టించుకోని అధికారులు



**నేటి సాక్షి,నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల పరిధిలోని చిత్తనూరు గ్రామంలో మద్యం విక్రయాలు అధిక ధరలకు జోరుగా సాగుతున్నాయని గ్రామ యువకుడు రంగాపురం రవీందర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మరికల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సుమారు 7 నుండి 9 వరకు బెల్ట్ షాపులు నడుస్తున్నాయని తెలిపారు. గ్రామంలో మద్యం విక్రయాలు జరపాలంటే దాదాపు రూ. 2.60 లక్షల రూపాయలు చెల్లించాలని గతంలో నిర్వహించిన ఒక సమావేశంలో నిర్ణయించినట్లు ఆయన వివరించారు. డబ్బులు చెల్లించిన వారే మద్యం విక్రయించాలని, ఐదు రోజుల్లోగా నిధులు జమ చేయని పక్షంలో విక్రయాలు నిలిపివేయాలని హుకుం జారీ చేసినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు. మద్యం అధిక ధరలకు విక్రయిస్తూ సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణపేట జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు వెంటనే స్పందించి చిత్తనూరు గ్రామాన్ని సందర్శించి, అక్రమ విక్రయాలపై చర్యలు తీసుకోవాలని రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు.

## రేషన్ బియ్యం అక్రమ రవాణా

### వాహనం స్వాధీనం



**నేటి సాక్షి,నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట పట్టణంలోని యాద్గిర్ రోడ్డు, బైరం కొండ గ్రామ సమీపంలో టాస్క్ ఫోర్స్ మరియు పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అశోక్ లేలాండ్ వాహనంలో (టీజీ 06 టీఏ 0828) తరలిస్తున్న సుమారు 25 క్వింటాళ్ల పి.డి.ఎస్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 50 సంచుల్లో ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. బియ్యం తరలిస్తున్న వాహన యజమానిని దామరగిద్ద మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన వెంకటేష్‌గా గుర్తించారు. డి.టి. కాలప్ప ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించిన అనంతరం, నిందితుడు వెంకటేష్‌పై నారాయణపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగిస్తున్నామని, రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# ఆర్టిజన్, అన్మాన్‌ల పోరుబాట

## నిరవధిక సమ్మెకు శ్రీకారం

- అరకొర వేతనాలతో వెట్టిచాకిరీ చేస్తున్నామని ఆర్టిజన్ల ఆవేదన
- మెట్‌పల్లి డివిజన్ కార్యాలయం ముందు నిరసన సమర శంఖం
- ఉద్యోగ భద్రత కల్పించి, సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్
- మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి






**నేటి సాక్షి,మెట్‌పల్లి,(రాధారపు నర్సయ్య):** తెలంగాణ రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్, అన్మాన్ కార్మికులు తమ చిరకాల సమస్యల పరిష్కారం కోసం పోరుబాట పట్టారు. అరకొర వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, రిటైర్మెంట్ ప్రయోజనాలు అందకపోవడం వంటి సమస్యలతో విసిగిపోయిన కార్మికులు జేఏసీగా ఏర్పడి గురువారం మెట్‌పల్లి డివిజన్ కార్యాలయం ముందు నిరవధిక సమ్మెకు శ్రీకారం చుట్టారు.

### వ్యవస్థకు వెన్నెముకగా ఉన్నా.. వివక్షే

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 19,061 మంది ఆర్టిజన్లు విద్యుత్ లైన్ల నిర్వహణ, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేస్తూ వ్యవస్థను నడిపిస్తున్నప్పటికీ, వారికి లభిస్తున్న వేతనం 15 వేల నుంచి 25 వేల లోపే ఉండటంపై కార్మికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా శ్రమిస్తున్నా.. గ్రాట్యుటీ, సెలవులు వంటి హక్కులు దక్కడం లేదని ఆరోపించారు. ఇన్సూరెన్స్ అమలులో లోపాలు ఉన్నాయని, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు సరైన పరిహారం అందడం లేదని బాధితులు వాపోయారు.

### ప్రధాన డిమాండ్లు ఇవే:

ఆర్టిజన్ కార్మికులకు ఏపీ ఎస్ ఈ బి (ఆ్యారాజుదీ) రూల్స్ వర్తింపజేయాలని, వారి అర్హతలను బట్టి వెంటనే కన్వర్షన్ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. అన్మాన్ కార్మికులను, స్పాట్ బిల్లర్లను సంస్థలో విలీనం చేయాలని, 2026 పీఆర్సీని అమలు చేయాలని కోరుతున్నారు.

### ప్రభుత్వం స్పందించాలి:

విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సారథ్యంలో తమ డిమాండ్లను పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని జేఏసీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-చైర్మన్ కాశెట్టి రాంబాబు, కన్వీనర్ దమ్మ రవీందర్ రెడ్డి, డివిజన్ కో-చైర్మన్ పిట్టల మహేష్ మరియు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని వారు స్పష్టం చేశారు.

# రెండోసారి రాష్ట్ర కార్యవర్గంలో స్థానం

- సురభి నవీన్ కుమార్‌కు రైల్వే వాకర్స్ సన్మానం
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎంపికపై అభినందనలు
- పార్టీ బలోపేతానికి చేసిన కృషికి గుర్తింపుగా సత్కారం



**నేటి సాక్షి,కోరుట్ల (రాధారపు నర్సయ్య):** సురభి నవీన్ కుమార్‌కు రెండవసారి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా స్థానం దక్కడంపై రైల్వే వాకర్స్ అసోసియేషన్ సభ్యులు చిరు సన్మానం నిర్వహించి అభినందనలు తెలిపారు. 'కోరుట్ల-రైల్వే వాకర్స్ అసోసియేషన్' ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సురభి నవీన్ కుమార్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఆయన పార్టీ పట్ల చూపుతున్న నిబద్ధత, సేవా దృక్పథం సభ్యులను ఆకట్టుకుందని పేర్కొన్నారు.బిజెపి పార్టీ బలోపేతానికి ఆయన చేసిన, చేస్తున్న కృషి, అంకితభావానికి దక్కిన గౌరవంగానే ఈ రాష్ట్ర కార్యవర్గ స్థానం లభించిందని అసోసియేషన్ సభ్యులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రైల్వే వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని సురభి నవీన్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం సాదాసీదాగా జరిగినప్పటికీ ఆత్మీయతతో నిండింది.

# మాజీ మావోయిస్టు నేతను కలిసిన జువ్వాడి నర్సింగ్ రావు



- మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు దేవ్ జీని శాలువాతో సత్కరించిన కాంగ్రెస్ ఇంచార్జి
- కోరుట్లలోని తిరుపతి స్వగృహంలో మర్యాదపూర్వక భేటీ
- ఆత్మీయ వాతావరణంలో సాగిన ముఖాముఖి చర్చలు
- కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ మరియు పార్టీ శ్రేణులు

**నేటి సాక్షి,కోరుట్ల,(రాధారపు నర్సయ్య):** మావోయిస్టు పార్టీ మాజీ కేంద్ర కమిటీ సభ్యులు తిప్పిరి తిరుపతి అలియాస్ 'దేవ్ జీ'ని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగ్ రావు గురువారం రాత్రి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కోరుట్ల పట్టణంలోని తిరుపతి స్వగృహానికి వెళ్లిన ఆయన, దేవ్ జీని శాలువాతో సత్కరించి గౌరవప్రదంగా పలకరించారు. ఇటీవల అజ్ఞాత జీవితాన్ని ముగించుకుని స్వగ్రామానికి చేరుకున్న తిప్పిరి తిరుపతిని కలుసుకున్న జువ్వాడి నర్సింగ్ రావు, ఆయనతో కొంతసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. ప్రజాజీవితంలోకి తిరిగి వచ్చిన తిరుపతిని రాజకీయ నాయకులు మర్యాదపూర్వకంగా కలవడం సామాజిక ఐక్యతకు సంకేతమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి నర్సింగ్ రావుతో పాటు కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ షాహిద్ ఉల్ అహ్మద్ పాల్గొన్నారు. అలాగే పలువురు వార్డు కౌన్సిలర్లు,



కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ భేటీ కోరుట్ల రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# గంజాయికి బానిసైనా ఇద్దరి వ్యక్తుల పై కేసు నమోదు



- బీమరం ఎస్ ఐ రాజేందర్

**నేటి సాక్షి,మంచిర్యాల:** భీమారం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవించడానికి అలవాటు పడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసిన భీమారం ఎస్సై రాజేందర్, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం,పొల్లవేని రాజేందర్ మరియు ఆలం మధుకర్ అనే వ్యక్తులు కొంతకాలంగా తమ స్నేహితులతో కలిసి గంజాయి సేవిస్తున్నట్లు పక్క సమాచారం తనిఖీలా నిర్వహన నేపథ్యంలో వారిని అదుపులోకి తీసుకుని,గంజాయి వినియోగం నిర్ధారించేందుకు ప్రత్యేక పరీక్షా కిట్ ద్వారా మెడికల్ ఆఫీసర్ సమక్షంలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం పాజిటివ్ రిపోర్ట్ వచ్చినట్లు వెల్లడించారు. దీంతో వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం సెక్షన్ 27(ఎ) ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇకపై గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువకులు తమ ప్రవర్తన మార్చుకోని యెడల వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుని, అవసరమైతే డీ–అడిక్షన్ కేంద్రాలకు తరలిస్తామని హెచ్చరించారు. పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ చూపించి, చెడు వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. అదేవిధంగా గంజాయి సేవిస్తున్న యువకుల గురించి సమాచారం తెలిసిన యెడల సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

# రైతుల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధి





- కోరుట్ల, మెట్‌పల్లిలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ప్రారంభం
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేత ప్రారంభం
- రూ.2400 మద్దతు ధరతో పారదర్శక కొనుగోలు హామీ
- రైతులు మధ్యవర్తులు లేకుండా నేరుగా విక్రయించాలని సూచన




**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య ):** జగిత్యాల జిల్లా రైతులకు ఉపశమనం కలిగించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక చర్యగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. కోరుట్ల, మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) కేంద్రాల్లో ఏర్పాటుచేసిన ఈ కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు మరియు ట్రాన్స్ జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కోరుట్ల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సమక్షంలో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం రైతుల్లో నమ్మకాన్ని పెంచడంతో పాటు, పంటకు సరైన ధర అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సందేశాన్ని అందించింది. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలిపారు. రైతులు తమ పంటను సంబంధిత కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర వద్ద విక్రయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులు పండించిన మొక్కజొన్న పంటకు రూ. 2400 మద్దతు ధరను కల్పిస్తూ, ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని మంత్రి ప్రత్యేకంగా సూచించారు. ఇలా చేస్తే రైతులకు సరైన ధర లభించడమే కాకుండా, ఎలాంటి మోసాలు జరగకుండా నివారించవచ్చని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటూ అనేక పథకాలు అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. రైతుల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కోరుట్ల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే ప్రతి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులకు లాభదాయకమైన విధానాలను అమలు చేస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించబడినట్లు తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం ద్వారా రైతులకు ఎంతో ఉపశమనం కలుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తూకం, నిల్వ, చెల్లింపుల ప్రక్రియలను వేగవంతంగా నిర్వహించి రైతులకు సకాలంలో నిధులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడానికి ముందు శుభ్రంగా సిద్ధం చేసి, తేమ శాతం ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇది కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంలో సహాయపడుతుందని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ అధికారులు, తహసీల్దార్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నిర్లక్ష్యంతో 'కళ్యాణలక్ష్మి' కాగితాలకే పరిమితం



- పెళ్లిళ్లు అయి ఏడాదిన్నరైనా చెక్కులు లేవని ఆడబిడ్డల తల్లిదండ్రుల ఆవేదన
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని లబ్ధిదారుల మండిపాటు
- గతంలో సకాలంలో అందిన సాయం.. నేడు నిధుల విడుదలపై గందరగోళం
- ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే గజ్వేల్‌లో ఆందోళనలకు బాధితుల హెచ్చరిక




**నేటి సాక్షి,గజ్వేల్ :** తెలంగాణలో పేద కుటుంబాలకు అండగా నిలిచిన 'కళ్యాణలక్ష్మి – షాదీ ముబారక్' పథకం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైపోతోందని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సకాలంలో అందిన ఈ ఆర్థిక భరోసా, ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఏడాదన్నర కాలంగా పెండింగ్‌లో పడిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గజ్వేల్ నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న అనేక కుటుంబాలు చెక్కుల కోసం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాయి. అధికారులను కలిస్తే "పై నుంచి ఆదేశాలు రాలేదు", "నిధులు విడుదల కాలేదు" అంటూ కాలయాపన చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. పెళ్లిళ్ల కోసం చేసిన అప్పులు, పెరుగుతున్న వడ్డీలతో నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా నలిగిపోతున్నాయి. ఒకప్పుడు సంక్షేమ పథకాల అమలులో ఆదర్శంగా నిలిచిన గజ్వేల్‌లో ప్రస్తుతం పరిస్థితి తలకిందులైందని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం పథకం ఉందని ప్రచారం చేసుకుంటోంది తప్ప, క్షేత్రస్థాయిలో అమలు కనిపించడం లేదని మండిపడుతున్నారు. ఎన్నికల హామీలను గాలికి వదిలేసి, ఉన్న పథకాలను కూడా అటకెక్కించడం పేదలకు శాపంగా మారిందని బాధితులు వ్యాఖ్యానిస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న కళ్యాణలక్ష్మి చెక్కులను వెంటనే పంపిణీ చేయాలని, లేనిపక్షంలో గజ్వేల్ వేదికగా పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేపడతామని బాధితులు హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి చెక్కుల పంపిణీని వేగవంతం చేయాలని కోరుతున్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన



**నేటి సాక్షి,నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల పరిధిలోని పసుపుల గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ స్థలాలను గ్రామ సర్పంచ్ నర్మదా రవికుమార్ గౌడ్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదలకు సొంతింటి కలను నిజం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కోరారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలని, నిర్మాణాల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శేఖర్, వివిధ వార్డుల సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# బోయకొండ గోశాలకు విరాళం



**నేటి సాక్షి,చౌడేపల్లి:** అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లి మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయ గోశాలకు శుక్రవారం భారీ విరాళం అందింది. చౌడేపల్లి పట్టణం మోటారు వీధికి చెందిన దాత శ్రీనివాసులు గోశాల నిర్వహణ కోసం రూ. 30,000 నగదును ఆలయ ఈవో, ఉప కమిషనర్ ఏకాంబరంకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాత శ్రీనివాసులుకు సాదరంగా ఆహ్వానం పలికి, అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వారికి పవిత్ర తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు. గోశాలలోని గోవుల సంరక్షణకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారిక సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి రహిత సమాజమే లక్ష్యం

జైపూర్ ఏసీపీ




**నేటి సాక్షి,చెన్నూర్ :** రామగుండం సీపీ, మంచిర్యాల డీసీపీ ఆదేశాల మేరకు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు నేతృత్వంలో చెన్నూర్ పట్టణ పోలీసులు కిష్టంపేట డిగ్రీ కళాశాలలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని, మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని హితవు పలికారు. గంజాయి సేవించడం వల్ల కలిగే అనర్థాలపై వీడియోల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తులో తప్పులు చేసి నేరాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పట్టణంలోని నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి, మద్యం సేవించే వారిపై, పేకాట ఆడేవారిపై నిఘా ఉంచేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే గంజాయికి అలవాటు పడిన వారిని గుర్తించి డీ–అడిక్షన్ సెంటర్లకు తరలిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ సీఐ బన్సీలాల్, ఎస్సై, కళాశాల ప్రిన్సిపాల్, కిష్టంపేట, లింగంపల్లి సర్పంచులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పాముకాటు బాధితుడికి పరామర్శ



**నేటి సాక్షి,మహబూబాబాద్:** నరసింహులపేట మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన మంద జగన్ పాముకాటుకు గురై మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్న జగన్ ఆరోగ్య పరిస్థితి గురించి ఆయన వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని, ప్రాణాపాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రెడ్యా నాయక్ వైద్యులకు సూచించారు. అనంతరం జగన్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఎటువంటి ఆందోళన చెందవద్దని, తాను అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ప్రస్తుతం జగన్ ఆరోగ్యం స్థిరంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ పరామర్శలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# తొలి తరం క్రికెటర్ గోపీనాథ్ కన్నుమూత

**చెన్నై:** భారత తొలి టెస్టు విజయంలో సభ్యుడు, నాటి జట్టులో గురువారం నాటికి సజీవంగా ఉన్న మాజీ క్రికెటర్ సీడీ గోపీనాథ్ (96) గురువారం చెన్నైలో కన్నుమూశారు. 1930లో నాటి మద్రాస్ (చెన్నై)లో పుట్టిన గోపీనాథ్.. 21 ఏండ్లకే అరంగేట్రం చేసి తొలి మ్యాచ్‌లోనే అర్ధ శతకం సాధించారు. తొలి టెస్టు విజయం కోసం 25 టెస్టులు వేచిచూసిన భారత జట్టు.. 1952 ఫిబ్రవరిలో విజయ్ హజారే సారథ్యంలో చిదంబరం స్టేడియం వేదికగా చెన్నైతో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లోని ఆఖరి టెస్టును గెలిచింది. ఆ జట్టులో గోపీనాథ్ (మ్యాచ్‌లో 35 రన్స్ చేశారు) సభ్యుడు. గోపీనాథ్ మరణంతో భారత క్రికెట్‌లో ఒక శకం ముగిసినైట్టెంది. భారత్ తరఫున ఆయన 8 టెస్టులు ఆడారు.




# ఫైనల్‌కు గోయట్..

## హన్సిక, నేహాకు కాంస్యాలు

**బిష్కెక్ :** కిర్గిస్థాన్‌లో జరుగుతున్న సీనియర్ ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత మహిళా రెజ్లర్ మీనాక్షి గోయట్ ఫైనల్‌కు చేరి పతకాన్ని ఖాయం చేసింది. 53 కిలోల విభాగం సెమీస్‌లో ఆమె.. సియోంగ్ పార్క్ (దక్షిణ కొరియా)పై గెలిచి ఫైనల్‌లో అడుగిడింది. 55 కిలోల విభాగంలో హన్సిక, 59 కిలోల క్యాటగిరీలో నేహా కాంస్య పోరులో తమ ప్రత్యర్థులను చిత్తుచేసి కాంస్యాలు సాధించారు.

# బాక్సర్ల పసిడి పంచ్..

## మీనాక్షి, ప్రీతి, అరుంధతి, ప్రియాకు స్వర్ణం

## అల్ఫియా, జైస్మీన్‌కు రజతం



**ఉలన్‌బాతర్ (మంగోలియా) :** ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా బాక్సర్లు పతకాల పంట పండించారు. గురువారం ఫైనల్ బరిలో నిలిచిన ఆరుగురిలో ఏకంగా నాలుగు స్వర్ణాలు, రెండు రజతాలతో సత్తాచాటారు. మీనాక్షి హుడా (48 కిలోలు), ప్రీతి పవార్ (54 కి.), ప్రియా గంఘాస్ (60 కి.), అరుంధతి చౌదరి (70 కి.) పసిడి పంచ్‌లు విసరగా అల్ఫియా (80ం కి.), జైస్మీన్ లంబోరియా (57 కి.) ఫైనల్‌లో ఓడినా రజతాలు గెలుచుకున్నారు.గురువారం తొలి పోరులో మీనాక్షి తన జోరును కొనసాగిస్తూ 5-0తో నొముందరి అమగలన్ (మంగోలియా)ను చిత్తు చేసింది. ఆ తర్వాత ప్రీతి సైతం అదే దూకుడుతో టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత హువాంగ్ సియావొ-వెన్ (చైనీస్ తైపీ)పై గెలిచి పసిడి సంబురాన్ని డబుల్ చేసింది. ఆ ఇద్దరి బాటలోనే నడిచిన ప్రియా.. 3-0తో వొన్ ఉన్-గ్యాంగ్ (ఉత్తర కొరియా)ను ఓడించగా అరుంధతి 4-1తో కజకిస్థాన్ బాక్సర్ సీడిష్‌పై నెగ్గింది. ఇదిలాఉండగా టోర్నీ ఆసాంతం రాణించిన జైస్మీన్ ఫైనల్‌లో 0-5తో పున్రివి (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలవ్వగా అల్ఫియా.. 0-5తో ఇస్లాంబెకొవ(కజికిస్థాన్) సైతం పరాజయం చవిచూసింది. ఈ టోర్నీలో భారత్ ఇప్పటిదాకా నాలుగు స్వర్ణాలు, రెండు రజతాలు, 4 కాంస్యాలతో మొత్తం పది పతకాలు సాధించింది. పురుషుల విభాగంలో విశ్వనాథ్ (48 కి.), సచిన్ (60 కి.) శుక్రవారం తమ ఫైనల్స్ మ్యాచ్‌లు ఆడనున్నారు.

# రాయల్స్ విధ్వంసం




## ఆర్సీబీపై ఆర్ఆర్ ఘనవిజయం!

- 202 పరుగుల భారీ లక్ష్యాన్ని ఊదిసేసిన ఆర్ఆర్
- సుడిగాలి ఇన్నింగ్స్‌తో చెలరేగిన వైభవ్ సూర్యవంశీ
- ధ్రువ్ జురెల్ బాధ్యతాయుత ఇన్నింగ్స్
- వృథా అయిన రజత్ పాటిదార్ (63) అర్ధసెంచరీ
- తేలిపోయిన ఆర్సీబీ బౌలర్లు.. 12 బంతులు మిగిలి ఉండగానే విజయం







**గువహాటి, ఏప్రిల్ 11:** ఐపీఎల్ టోర్నీలో భాగంగా గువహాటిలోని బర్సపరా స్టేడియం వేదికగా శుక్రవారం జరిగిన 16వ లీగ్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ (ఆర్సీబీ) పై రాయల్స్ (ఆర్ఆర్) ఆరు వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. భారీ లక్ష్య ఛేదనలో ఆర్ఆర్ కుర్రాళ్లు వైభవ్ సూర్యవంశీ, ధ్రువ్ జురెల్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆర్ఆర్.. ముందుగా ప్రత్యర్థిని భారీ స్కోరుకే పరిమితం చేసినా, బ్యాటింగ్ లో అసాధారణ సత్తా చాటి 18 ఓవర్లలోనే లక్ష్యాన్ని సునాయాసంగా చేరుకుంది.

### కోహ్లీ మెరుపులు.. పాటిదార్ నిలకడ

తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 201 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ విరాట్ కోహ్లీ కేవలం 16 బంతుల్లోనే 32 పరుగులు చేసి జట్టుకు అదిరిపోయే శుభారంభం అందించాడు. ఆ తర్వాత రజత్ పాటిదార్ (40 బంతుల్లో 63) బాధ్యతాయుతమైన అర్ధసెంచరీతో ఇన్నింగ్స్ కు వెన్నెముకలా నిలిచాడు. చివర్లో వెంకటేష్ అయ్యర్ కేవలం 15 బంతుల్లోనే అజేయంగా 29 పరుగులు రాబట్టడంతో ఆర్సీబీ స్కోరు బోర్డు 200 దాటింది. ఆర్ఆర్ బౌలర్లలో రవి బిష్ణోయ్ (2/32), జోఫ్రా ఆర్చర్ (2/33), బ్రిజేష్ శర్మ (2/37) తలా రెండు వికెట్లు పడగొట్టి ఆర్సీబీని కట్టడి చేసే ప్రయత్నం చేశారు.

### సూర్యవంశీ విధ్వంసం.. జురెల్ ఫినిషింగ్ టచ్

202 పరుగుల కఠిన లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్ఆర్‌కు వైభవ్ సూర్యవంశీ ఊహించని విధ్వంసకర ఆరంభాన్ని ఇచ్చాడు. కేవలం 26 బంతుల్లోనే 78 పరుగులు చేసి ఆర్సీబీ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతడి స్ట్రైక్ రేట్ ఏకంగా 300 ఉండటం గమనార్హం. సూర్యవంశీ సుడిగాలి ఇన్నింగ్స్‌తో పవర్ ప్లేలోనే ఆర్ఆర్ విజయం లాంఛనమైంది. మరో ఎండ్ లో ధ్రువ్ జురెల్ (43 బంతుల్లో 81 నాటౌట్) యాంకర్ రోల్ పోషిస్తూనే వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు బాదుతూ జట్టును విజయతీరాలకు చేర్చాడు. రవీంద్ర జడేజా (25 బంతుల్లో 24 నాటౌట్) వికెట్ పడకుండా జాగ్రత్త పడుతూ జురెల్ కు అండగా నిలిచాడు.




### తేలిపోయిన ఆర్సీబీ బౌలింగ్

భారీ స్కోరును కాపాడుకోవడంలో ఆర్సీబీ బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. కృనాల్ పాండ్యా 2 వికెట్లు (2/30) తీసినా ఫలితం లేకపోయింది. ప్రధాన పేసర్ జోష్ హేజిల్‌వుడ్ 4 ఓవర్లలో ఏకంగా 44 పరుగులు సమర్పించుకున్నాడు. రొమారియో షెపర్డ్ 2 ఓవర్లలోనే 18 పరుగులు ఇచ్చాడు. ఆర్ఆర్ బ్యాటర్ల దాటికి ఆర్సీబీ బౌలర్ల వద్ద ఎలాంటి సమాధానం లేకుండా పోయింది. ఫలితంగా మరో 12 బంతులు మిగిలి ఉండగానే కేవలం 4 వికెట్లు మాత్రమే కోల్పోయి ఆర్ఆర్ 202 పరుగులు సాధించి దర్జాగా గెలుపొందింది.

# మూడో సీడ్‌పై ఆయుశ్ అదిరే విజయం..

## భారత పతక ఆశలు సజీవం..!

చైనా వేదికగా జరుగుతున్న బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి చెలరేగుతున్నాడు. సీనియర్లు చేతులెత్తేసిన చోట తన దూకుడైన ఆటతో ప్రత్యర్థులను మట్టికరిపిస్తున్న ఆయుశ్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. పురుషుల సింగిల్స్‌లో అదుర్స్ అనిపిస్తున్న భారత కుర్రాడు క్వార్టర్స్‌లో మూడో సీడ్ సీడ్ జోనాథన్ క్రిస్టీ(ఇండోనేషియా)ను ఓడించాడు. అద్భుత విజయంతో సెమీస్ చేరిన ఆయుశ్ పతకంపై ఆశలు రేపుతున్నాడు. బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్ పురుషుల సింగిల్స్‌లో ఆయుశ్ శెట్టి జైత్రయాత్ర కొనసాగుతోంది. తొలి రౌండ్‌లోనే ఏడో ర్యాంకర్ చైనా ఆటగాడిని ఇంటికి పంపిన ఆయుశ్ అదే ఊపులో 25వ ర్యాంకరైన చీ యూ జెన్(చైనీస్ తైపీ)ను వణికించాడు. క్వార్టర్స్‌లోనూ జోరు చూపించిన భారత షట్లర్ జొనాథన్ క్రిస్టీకి చెక్ పెట్టాడు. హోరాహోరీగా జరిగిన తొలి సెట్‌ను 23-21తో గెలుచుకున్న ఆయుశ్ రెండో సెట్‌లో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వలేదు. 21-17తో మ్యాచ్ ముగించి సెమీస్ పోరుకు సిద్ధమయ్యాడు.




తద్వారా ఈ మెగా టోర్నీలో భారత పతక ఆశలను సజీవంగా ఉంచాడీ యంగ్‌స్టర్. సీనియర్లు హెచ్‌హెస్ ప్రణయ్, పీవీ సింధులు ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించిన విషయం తెలిసిందే.



# కథలో బలం లేకున్నా కొత్తదనం

## డెకాయిట్‌గా ఫర్వాలేదనిపించిన అడవిశేష్

అడివి శేష్ డబుల్ హ్యాట్రిక్ విజయాలతో జోరు మీదున్నారు. పైగా 'మేజర్'తో జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకున్నాడు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'డెకాయిట్'పై ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ మంచి అంచనాలు ఏర్పడ్డాయి. హరిదాస్ (అడివి శేష్) ఓ హత్య కేసులో 13 ఏళ్లుగా జైలు జీవితం అనుభవిస్తుంటాడు. ఓరోజు తనని కడప జైలు నుంచి మారుస్తుండగా పోలీసుల నుంచి తప్పించు కుంటాడు. దీనికోసం ఇషాద్ భాయ్ (అతుల్ కులకర్ణి) అతనికి సాయం చేస్తాడు. హరి అలా తప్పించుకోగానే తనని దుబాయ్ పంపేందుకు అన్ని ఏర్పాట్లు చేయగా.. దానికోసం ఇంకా రూ.60లక్షలకు పైగా డబ్బు అవసరమవుతుంది. అయితే అతను దుబాయ్‌కి వెళ్లేలోపు తనకు అవసరమైన డబ్బు సంపాదించడంతో పాటు మరో పని కూడా చేయాలనుకుంటాడు. తనని జైలు పాలయ్యేలా చేసిన తన మాజీ ప్రేయసి సరస్వతి అలియాస్ జూలియట్ (మృణాల్ ఠాకూర్)పై పగ తీర్చుకోవాలని నిర్ణయించుకుంటాడు. ఈక్రమంలోనే ఆమెను వెతుక్కుంటూ ఇంటికెళ్లగా ఓ ఆరేళ్ల కూతురి తల్లిగా దర్శనమిస్తుంది సరస్వతి. ఆమె భర్త భాస్కర్ (వైభవ్) తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలై ఉంటాడు. తన ప్రాణాలు కాపాడాలంటే ఆమెకు రూ.1కోటి డబ్బు అవసరం. ఆమె పరిస్థితిని చూసిన హరి.. తన ఆర్థిక అవసరాన్ని అడ్డం పెట్టుకునే దెబ్బ కొట్టాలని ఓ ప్రణాళిక రచిస్తాడు. హరిని సరస్వతి హత్య కేసులో ఎందుకు ఇరికించింది? దీనికి ఆమె భర్త భాస్కర్‌కు ఉన్న లింకేంటి? ఈ కథలో సీఐ స్వామి అలియాస్ రాంబాబు (అనురాగ్ కశ్యప్), కరుణ హాస్పిటల్స్ ఛైర్మన్ (ప్రకాశ్ రాజ్), మల్లి (కామాక్షి భాస్కర్ల) పాత్రలకు ఉన్న ప్రాధాన్యత ఏంటన్నదే కథ. అడివి శేష్ సినిమా అనగానే ప్రేక్షకుల్లో బలమైన భరోసా కనిపిస్తుంది. తను ఓ కథ ఎంచుకున్నాడంటే తప్పకుండా అందులో ఏదో వైవిధ్యత ఉంటుందని.. థ్రిల్‌కు ఏ లోటు ఉండదని అందరి నమ్మకం.

ఇక ఈసారి 'డెకాయిట్'కి తనే స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే అందించాడనే సరికి దీనిపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత రెట్టింపయ్యాయి. కథ, కథనాల్లో మరీ అంత కొత్తదనమేమీ లేకపోయినా కొన్ని మెరుపులతో ఆ లోటు తెలియనీయలేదు. ఓ కులాంతర ప్రేమకథకు.. తనదైన శైలిలో ట్విస్ట్‌లు, టర్న్‌లు జోడించి ఓ మాస్ యాక్షన్ సినిమాని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు శేష్ . హీరో ఎప్పుడైతే జైలు నుంచి తప్పించుకుంటాడో అక్కడి నుంచి సినిమా వేగం పుంజుకుంటుంది. హీరో ఎప్పుడైతే కథానాయిక జీవితంలోకి తిరిగి ఎంట్రీ ఇస్తాడో అక్కడి నుంచి కథలో సంఘర్షణ మొదలవుతుంది. వాళ్లిద్దరూ కలిసి డబ్బు దోచుకునేందుకు సిద్ధమైనప్పటి నుంచి ఆ సంఘర్షణ రెట్టింపవుతుంది. ఓ వైపు నాయకానాయికల్ని వెతికి పట్టుకునేందుకు సీఐ స్వామి రంగంలోకి దిగడం.. వాళ్లని తప్పించుకుని, కథానాయికని పోలీసులకు పట్టించాలని హీరో చేసే ప్రయత్నాలతో ద్వితీయార్థం థ్రిల్లింగ్‌గా మొదలవుతుంది. క్లైమాక్స్‌ని భావోద్వేగభరితంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో హీరో చేసే త్యాగం 'ప్రేయసి రావే' లాంటి క్లాసిక్ చిత్రాన్ని గుర్తు చేస్తుంది. కాకపోతే ఆ ముగింపును ప్రేక్షకులు ఎలా స్వీకరిస్తారన్న దానిపై చిత్ర ఫలితం ఆధారపడి ఉంది. హరిదాస్ పాత్రలో మాసీ లుక్స్‌లో అడివి శేష్ కనిపించిన విధానం.. తన నటన.. మదనపల్లి యాసలో పలికిన సంభాషణలు అన్నీ ప్రేక్షకుల్ని అలరిస్తాయి. యాక్షన్‌తో పాటు భావోద్వేగభరిత సన్నివేశాల్లోనూ అదరగొట్టారు. తన జూలియట్‌గా సరస్వతి పాత్రలో మృణాల్ ఒదిగిన తీరు ఆకట్టుకుంటుంది. అడివి శేష్ రాసుకున్న కథలో కొత్తదనం లేదు. స్క్రీన్‌ప్లేతో తనదైన శైలిలో అక్కడక్కడా మ్యాజిక్ చేసే ప్రయత్నం చేశారు. భీమ్స్ నేపథ్య సంగీతం, పాటలు ఆకట్టుకుంటాయి. ఛాయాగ్రహణం.. నిర్మాణ విలువలు బాగున్నాయి.




# కొరియన్ కనకరాజు నుంచి కమ్సాహంనిదా' పాట ప్రోమో

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'కొరియన్ కనకరాజు' . ఇండో-కొరియన్ నేపథ్యంలో హారర్-కామెడీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం ఘనంగా ప్రారంభించింది. ఈ చిత్రంలోని మొదటి పాట 'కమ్సాహంనిదా' ప్రోమోను తాజాగా విడుదల చేయగా, దీనికి విశేష స్పందన లభిస్తోంది. సంగీత దర్శకుడు ఎస్. థమన్, వరుణ్ తేజ్ మరియు దర్శకుడు మేర్లపాక గాంధీ మధ్య సాగే ఫన్నీ సంభాషణలతో కూడిన ఈ ప్రోమో యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచింది. మెలోడీ కింగ్ సిద్ శ్రీరామ్ ఆలపించిన ఈ పూర్తి పాటను ఏప్రిల్ 11న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, స్టార్ కమెడియన్ సత్య కీలకమైన వినోదాత్మక పాత్రలో అలరించనున్నారు. కొరియా సంస్కృతికి మరియు లోకల్ క్యారెక్టర్ అయిన కనకరాజుకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధాన్ని దర్శకుడు మేర్లపాక గాంధీ తన మార్కు వినోదంతో వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు. ఇప్పటికే మేజర్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఆఖరి షెడ్యూల్‌ను దక్షిణ కొరియాలోని అందమైన లొకేషన్లలో పూర్తి చేసుకోబోతుంది. యూవీ క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ, ప్రమోద్ మరియు విక్రమ్ ఈ చిత్రాన్ని భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ ఈ డిఫరెంట్ కథాంశంతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాను 2026 వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.




# మైఖేల్ జాక్సన్ బయోపిక్ ట్రైలర్ విడుదల విడుదల

ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న పాప్ రారాజు మైఖేల్ జాక్సన్ బయోపిక్ 'మైఖేల్' ఫైనల్ ట్రైలర్‌ను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది . ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్ పోషిస్తుండగా, ట్రైలర్‌లో ఆయన బాడీ లాంగ్వేజ్, డ్యాన్స్ మూమెంట్స్ మరియు లుక్ అచ్చం మైఖేల్ జాక్సన్‌ను తలపిస్తుండటం విశేషం. దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా తెరకెక్కించిన ఈ ట్రైలర్‌లో 'బీట్ ఇట్', 'థ్రిల్లర్', 'బిల్లీ జీన్' వంటి ఐకానిక్ సాంగ్స్ ప్రదర్శనలతో పాటు, మైఖేల్ వ్యక్తిగత జీవితంలోని భావోద్వేగ అంశాలను, బాల్యంలో ఆయన ఎదుర్కొన్న సంఘర్షణలను మరియు వివాదాలను ఎంతో ఆకట్టుకునేలా చూపించారు. ఆస్కార్ విజేత గ్రాహమ్ కింగ్ నిర్మించిన ఈ చిత్రంలో కోల్‌మన్ డొమింగో, నియా లాంగ్, మైల్స్ టెల్లర్ వంటి హాలీవుడ్ ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించారు. కేవలం ఒక సంగీత ప్రయాణంలా కాకుండా, ఒక లెజెండరీ స్టార్ జీవితంలోని ఎత్తుపల్లాలను ఆవిష్కరించే ఈ చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అన్ని హంగులతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.



# దసరాకు ఫౌజీ

ఈ ఏడాది ఆరంభంలో రాజాసాబ్‌తో ఫ్లాప్ ఇచ్చిన రెబల్ స్టార్ ప్రభాస్.. ఇదే ఏడాదిలో సాలిడ్ హిట్ ఇవ్వాలని డిసైడ్ అయ్యాడు. ప్రభాస్ నుంచి 'ఫౌజీ' సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సీతారామం తర్వాత దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ సినిమా సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతోంది. ఇప్పటికే మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అఫీషియల్‌గా ప్రకటించనప్పటికీ.. వచ్చే దసరాకు ఫౌజీని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. కానీ ఈ ఏడాది డిసెంబరు పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. అయితే చిత్ర యూనిట్ మాత్రం ఈ సినిమాను ముందుగా అనుకున్న సమయానికే ప్రేక్షకులకు అందించాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం నిర్మాణ పనులను ముమ్మరం చేస్తూ ఏకకాలంలో షూటింగ్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. షెడ్యూల్ ప్రకారం సినిమాను పూర్తి చేయడం కోసం మేకర్స్ 'సెకండ్ యూనిట్'ను కూడా రంగంలోకి దించినట్టుగా తెలుస్తోంది.




# ఇప్పుడే మొదలెట్టినట్లుంది

"దక్షిణాది ప్రేక్షకులు నా పట్ల ఎప్పుడూ ఎంతో ప్రేమతో ఉంటున్నారు. నన్ను వాళ్ల కుటుంబంలోని వ్యక్తిలా ఆదరించారు. ఇది నాలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది" అంటోంది తమన్నా. ఓవైపు మహిళా ప్రాధాన్య చిత్రాలు, మరోవైపు ఓటీటీ కథలు.. ప్రత్యేక పాటలు.. ఇలా ఎదురొచ్చిన అవకాశాన్ని అందుకుంటూ అభిమానుల్ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుందీమె. ఈ మధ్యే సినీరంగంలో 21ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ కార్యక్రమంలో పాల్గొన్న తమన్నా మాట్లాడుతూ.. "ప్రస్తుతం నేను నటించిన చిత్రాలన్నీ ఒక్కొక్కటిగా విడుదల కాబోతున్నందుకు ఉత్సాహంగా ఉన్నా. చాలా మంది నటీనటులకు.. ముఖ్యంగా నటీమణులకు ఇలాంటి అవకాశం లభించదు. నా కెరీర్ మొదలై దాదాపు 21ఏళ్లు అయ్యింది. అయినా ఇప్పుడే మళ్లీ ప్రారంభిస్తున్నట్లుగా ఉంది. దక్షిణాది పరిశ్రమలో లభిస్తున్న ఆదరణ నాకు మరింత ఉత్తేజాన్ని కలిగిస్తుంది. అందుకే నేను కూడా వారిని కొత్త కథలు, ప్రయోగాత్మక చిత్రాలతో అలరించాలని భావిస్తున్నాన"ని చెప్పుకొచ్చింది.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యం





**నేటి సాక్షి, జగిత్యాల(రాధారపు నర్సయ్య):** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ హోమియోపతి దినోత్సవం, ఆయుష్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఉదయం యోగా భవన్‌లో యోగా ప్రదర్శనను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మెగా ఆయుష్ వైద్య శిబిరాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్, ఐవీసూ సుజాతతో కలిసి ప్రారంభించారు. ఈ శిబిరంలో హోమియోపతి, ఆయుర్వేదం మరియు ఇతర ఆయుష్ వైద్య విధానాల ద్వారా ప్రజలకు ఉచిత వైద్య సేవలు, ఔషధాలు అందించడం జరుగుతుంది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ మాట్లాడుతూ, ప్రతిరోజు ఉదయం యోగ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు.

- **జీవన శైలిలో యోగ ఒక భాగంగా అలవార్చుకోవాలి**
- **ఆరోగ్య సంరక్షణకు యోగ ఎంతో అవసరం**
- **జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాజా గౌడ్**

రోజువారి జీవనశైలిలో యోగ ప్రక్రియను ఒక భాగంగా అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఆయుష్ వైద్య విధానాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. యోగా, ఆయుర్వేదం, హోమియోపతి వంటి సంప్రదాయ వైద్య పద్ధతులు ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు జీవనశైలిని మెరుగుపరుస్తాయని వివరించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ మెగా ఆయుష్ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సులభంగా వైద్య సేవలు అందించడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ప్రజలందరూ యోగా వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఓ సుజాత, వివిధ జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

# జీవన్ రెడ్డి పార్టీ మారడం ఆయన వ్యక్తిగత విషయం



- **కాంగ్రెస్ పార్టీకి లక్షలాదిమంది కార్యకర్తలు ఉన్నారు..**
- **2029 లోనూ రేవంత్ రెడ్డే ముఖ్యమంత్రి..**
- **రైతులను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం..**
- **ఆర్థికంగా ఇబ్బంది ఉన్న రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం..**
- **రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వ్యాఖ్యలు కలకలం**

**నేటి సాక్షి, మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య):** మాజీ మంత్రి జీవన్ రెడ్డి పార్టీ మారడం ఆయన వ్యక్తిగత విషయమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. అనేక సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీకి ఉన్న అనుబంధం నేపథ్యంలో పార్టీ మారవద్దని రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి శ్రీధర్ బాబు తోపాటు తో పాటు పలువురు ఎమ్మెల్యేలు స్వయంగా కలిసి పార్టీ మారవద్దని కోరినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. శుక్రవారం కోరుట్ల,మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అనంతరం మంత్రి లక్ష్మణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసి తీరుతామని తీరుతామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అండతో 2029లో సైతం రేవంత్ రెడ్డే రాష్ట్ర ముఖ్యమంత్రి అవుతారని మంత్రి అడ్లూరి తెలిపారు.వందేళ్ళ చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీకి లక్షలాది మంది కార్యకర్తలు ఉన్నారని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాలంలోనే శ్రీశైలం, నాగార్జునసాగర్, శ్రీ రామ్ సాగర్ వంటి అనేక సాగునీటి ప్రాజెక్టులు నిర్మించమని మంత్రి గుర్తు చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతులకు మద్దతు ధర ప్రకటించడం తప్ప కొనుగోలు విషయంలో రాష్ట్రానికి ఎలాంటి సహకారం అందించడం లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రైతులు పంట మార్పిడిలో భాగంగా జగిత్యాల జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కజొన్న సాగు చేశారని మంత్రి తెలిపారు. రైతులు పండించిన మొక్కజొన్న పంటలు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని మంత్రి వివరించారు.రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రూ. 2400 క్వింటాల్ మక్కలు కొనుగోలు చేస్తున్నామని మంత్రి వివరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కజోన్న కొనుగోలు కేంద్రాలతో రాష్ట్ర ప్రభుత్వంపై సుమారు రూ. 500 కోట్ల భారం పడుతుందని మంత్రి తెలిపారు. ప్రజల కోసం బాధ్యతగా పనిచేస్తున్న ప్రభుత్వం కనుక రైతుల కోరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు.రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా కోరుట్ల నియోజకవర్గంలోని నాలుగు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. రైతులు ప్రభుత్వ నిబంధనలకు అనుకూలంగా మొక్కజొన్నలు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని మంత్రి సూచించారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో కేసీఆర్ అనేక హామీలు ఇచ్చి మర్చిపోయారని మంత్రి అన్నారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన ఒక్క హామీని కేసీఆర్ నిలబెట్టుకోలేదని మంత్రి ఆరోపించారు. దళితున్ని ముఖ్యమంత్రి చేస్తామన్నారని కానీ ఏనాడు దళితులను కేసీఆర్ పట్టించుకోలేదని మంత్రి అన్నారు.రాష్ట్రంలో ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులతో పాటు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ రాష్ట్రంలో గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వంతో చేయించాల్సిన పనులను పక్కనపెట్టి రాష్ట్ర ప్రభుత్వంపై నిత్యం బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# “అన్నా.. నన్ను దేవుడే పంపాడు”

## కేసీఆర్‌తో భేటీలో జీవన్ రెడ్డి భావోద్వేగం



**నేటి సాక్షి,గజ్వేల్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఎర్రవెల్లి నివాసంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ భేటీ అత్యంత భావోద్వేగ వాతావరణంలో సాగింది. కేసీఆర్‌ను కలిసిన సందర్భంలో జీవన్ రెడ్డి స్పందిస్తూ.. “అన్నా.. నన్ను దేవుడే పంపించాడు మీతో కలిసి పని చేయమని..” అంటూ తన మనసులోని మాటను బయటపెట్టారు. కేసీఆర్ నాయకత్వంలో పార్టీ బలోపేతానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అంతకుముందు ఎర్రవెల్లి చేరుకున్న జీవన్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. ఈ భేటీలో ఉత్తర తెలంగాణ రాజకీయ పరిణామాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ మరియు రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్. రమణ, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, విద్యాసాగర్ రావు తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు. బీఆర్ఎస్ పునర్వ్యవస్థీకరణ దిశగా అడుగులు వేస్తున్న తరుణంలో జరిగిన ఈ భేటీ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# 'అరైవ్-అలైవ్'

## రోడ్డు భద్రతా వారోత్సవాలు



**నేటి సాక్షి,జగిత్యాల(రాధారపు నర్సయ్య):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఏప్రిల్ 13 నుంచి 18 వరకు జిల్లావ్యాప్తంగా 'అరైవ్-అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా ఆరు రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో భాగంగా, మొదటి రోజు గ్రామ స్థాయిలో రోడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేసి ప్రజలకు సురక్షిత డ్రైవింగ్‌పై అవగాహన కల్పిస్తారు. రెండవ రోజు అంబేద్కర్ జయంతి సందర్భంగా ట్రాఫిక్ నియమాలపై ప్రతిజ్ఞ చేయిస్తారు. వారోత్సవాల్లో భాగంగా చిన్నారులు, విద్యార్థులకు ప్రత్యేకంగా 'రోడ్ సేఫ్టీ డే' నిర్వహిస్తామని, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ ప్రాముఖ్యతను వివరిస్తామని ఎస్పీ పేర్కొన్నారు. యువతను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తామన్నారు. ముఖ్యంగా ప్రమాద సమయంలో ప్రాణాలు కాపాడే 'గోల్డెన్ అవర్' గురించి ఫస్ట్ రెస్పాండర్స్‌కు శిక్షణ ఇస్తామని, చివరి రోజున 'జీరో ఎన్‌ఫోర్స్‌మెంట్ డే' ద్వారా నిబంధనలు ఉల్లంఘించే వారికి కౌన్సెలింగ్ ఇస్తామని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లను అలవర్చుకుని రోడ్డు భద్రతలో భాగస్వాములు కావాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడిగా దాసరి అశోక్ నియామకం



**నేటి సాక్షి,నారాయణపేట (ఇమామ్ సాబ్):** బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నారాయణపేట నియోజకవర్గ అధ్యక్షుడిగా మరికల్ మండలం ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన దాసరి అశోక్ నియమితులయ్యారు. ఈ మేరకు బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నియోజకవర్గ కమిటీలోని ఇతర బాధ్యులను కూడా ఆయన ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా హరీష్, కార్యదర్శిగా అరవింద్, మరియు కోశాధికారిగా రమేష్‌లను నియమించినట్లు తెలిపారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. బహుజనులకు రాజ్యాధికారమే బీఎస్పీ అంతిమ లక్ష్యమని స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఏకమై దోపిడీ కుల రాజకీయాలకు బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి, బహుజన సిద్ధాంతాల వ్యాప్తికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ నియామకం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

# పశువైద్యాధికారుల పర్యటన




**నేటి సాక్షి,మేడిపల్లి:** మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామంలో పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా వెటర్నరీ డాక్టర్ల పర్యటన మరియు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ.. పోరుమల్ల గ్రామంలో పశువుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున వాటి సంరక్షణ, పెంపుదలపై రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పశువుల ఆరోగ్యం మరియు అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న వివిధ పథకాల గురించి ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీలు డాక్టర్ నరేష్, డాక్టర్ శ్రీదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ యాదవ్, సర్పంచ్ గుయ్య అంజన్న, ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి ప్రణయ్ రెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు వివిధ మండలాల నుంచి వచ్చిన వైద్యాధికారులు, వార్డు సభ్యులు సత్యం, మిట్టపల్లి భూమారెడ్డి, తిరుపతి రెడ్డి మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు. పశుసంపదను కాపాడుకుంటూ పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చుకోవాలని అధికారులు రైతులకు అవగాహన కల్పించారు.

# బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** పట్టణంలోని 9వ వార్డు ప్రకాష్ నగర్ లో అంగన్వాడి టీచర్స్, ఆశ వర్కర్లు పట్టణ టూ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం బాలల పరిరక్షణ కమిటిని ఏర్పాటు చేశారు. అలాగే కొత్తగా గెలిచిన 8 మరియు 9 కౌన్సిలర్లను అంగన్వాడి ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ పోలీసులు, తొమ్మిదో వార్డ్ కౌన్సిలర్ అవుట శ్రీనివాస్, 8వ వార్డు కౌన్సిలర్ చక్రపాణి నాయక్, మహిళా సంఘం అధ్యక్షురాలు అవుట ధనలక్ష్మి, మరియు బిఎల్ఆర్ బ్రదర్స్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చౌడేపల్లి అభివృద్ధి పనుల్లో పాల్గొన్న గువ్వల రమేష్ రెడ్డి







నేటి సాక్షి,చౌడేపల్లి: అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లి మండల పరిధిలో శుక్రవారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా బోయకొండ గంగమ్మ ఆలయాన్ని సందర్శించిన ఆయన, రాహుకాల అభిషేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ గోశాలను పరిశీలించి, వేసవి నేపథ్యంలో గోవులకు మేత, తాగునీటి సౌకర్యాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. దిగువపల్లి పంచాయతీ ఆర్ఆర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన శుద్ధ జల కేంద్రాన్ని (ఆర్వో ప్లాంట్) రమేష్ రెడ్డి ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. దశాబ్దాలుగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించినందుకు కాలనీవాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మేకలవారిపల్లి ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోయకొండ సుబ్బు, సుజేయన్ రాజు, హమీద్ ఖాన్, కుమార్ రెడ్డి, సోము, రాధాకృష్ణతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# జనగణన, భూ స్వాధీన పనులపై కలెక్టర్ సమీక్ష



- కోరుట్ల ఆర్డీవో కార్యాలయంలో పనుల పురోగతిపై పరిశీలన
- ఖచ్చితమైన జనగణనకు ప్రతి ఇంటి వివరాలు నమోదు చేయాలన్న ఆదేశం
- భూ స్వాధీన ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని సూచనలు

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా అభివృద్ధికి కీలకమైన జనగణన, భూ స్వాధీన పనులపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించారు. కోరుట్లలో కొనసాగుతున్న ఈ పనులను స్వయంగా పరిశీలిస్తూ అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. కోరుట్ల ఆర్డీవో కార్యాలయంలో కొనసాగుతున్న 'జనగణన..భూ స్వాధీన' పనులను జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత విభాగాల అధికారులతో సమావేశమై పనుల ప్రగతిని సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. జనగణన కార్యక్రమం దేశ అభివృద్ధికి కీలకమని పేర్కొన్న కలెక్టర్, ప్రతి ఇంటికి వెళ్లి సమగ్ర వివరాలు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఖచ్చితమైన సమాచారం సేకరణ ద్వారానే భవిష్యత్ ప్రణాళికలు సక్రమంగా అమలవుతాయని తెలిపారు. అందువల్ల అధికారులు బాధ్యతాయుతంగా, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. భూ స్వాధీన ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత భూ యజమానులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.పనుల పురోగతిని పరిశీలించిన అనంతరం నిర్ణీత కాలపరిమితిలో అన్ని పనులను పూర్తి చేయాలని కలెక్టర్ బి. సత్యప్రసాద్ స్పష్టం చేశారు. అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

## అదనపు కలెక్టర్

**నేటి సాక్షి,మంచిర్యాల:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు తమ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య సూచించారు. శుక్రవారం భీమిని మండలం రాంపూర్ గ్రామంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా పర్యటించిన ఆయన, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను మరియు ఉపాధి హామీ పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు తెలిపారు. అనంతరం మల్లిడి గ్రామపంచాయతీలో అభివృద్ధి పనులను, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్వాడీ విద్యార్థుల ఎత్తు, బరువులను తనిఖీ చేసిన ఆయన, గర్భిణీలు మరియు బాలింతలకు పౌష్టికాహారం అందించాలని సిబ్బందిని



ఆదేశించారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని, ప్రతి కుటుంబం 100 రోజుల పనిని పూర్తి చేసుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గంగామోహన్, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్, వివిధ గ్రామాల సర్పంచులు మరియు పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు

## జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**నేటి సాక్షి,జగిత్యాల(రాధారపు నర్సయ్య):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 13 నుండి 18 వరకు జిల్లావ్యాప్తంగా 'ఆరైవ్ - అలైవ్ క్యాంపెయిన్' నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి ఆయన రోడ్డు భద్రతా అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 8 ప్రధాన బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో చేపట్టిన పనుల పురోగతిని ఆర్&బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జగిత్యాల-పెద్దపల్లి రోడ్డులో పనులు పూర్తయ్యాయని, ఎన్‌హెచ్-563లో 15 చోట్ల రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేశామని అధికారులు వివరించారు. జగిత్యాల పట్టణంలోని ట్రాఫిక్ సిగ్నల్స్ మరమ్మత్తులు చేయాలని, బస్టాండ్ పార్కింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొండగట్టు ప్రాంతంలో రోడ్డు




ఆక్రమణలు తొలగించాలని, ప్రమాదాలకు కారణమవుతున్న గుంతలను తక్షణమే పూడ్చాలని సూచించారు. ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. మైనర్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై కఠినంగా వ్యవహరిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించే వారి లైసెన్సుల రద్దుకు ఆర్టీఓకు సిఫార్సు చేస్తున్నామని తెలిపారు. హెల్మెట్ ధారణపై ప్రజల్లో అవగాహన పెంచుతూనే, కఠినంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, రాజ గౌడ్, ఆర్డీవో మధుసూదన్ మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిరుపయోగంగా చేతి పంపులు

## మరమ్మతుల్లో నిర్లక్ష్యం.. ప్రజల్లో ఆందోళన




**నేటి సాక్షి, ఎండపల్లి:** మండలం పరిధిలోని చర్లపల్లి గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తే సూచనలు కనిపిస్తున్నాయి. గ్రామంలో ఉన్న 14 చేతి పంపుల్లో సగం మాత్రమే పనిచేస్తుండగా, మిగతావి చెడిపోయి మరమ్మతులు లేక నిరుపయోగంగా మారాయి. చేతి పంపుల సమస్యను గ్రామ సభల్లో పలుమార్లు ప్రస్తావించినప్పటికీ, సంబంధిత పంచాయతీ పాలకులు స్పందించకపోవడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టించుకునే నాధులు లేకపోవడంతో సమస్య అలాగే కొనసాగుతోందని వారు అంటున్నారు. ప్రజలకు సరిపడా తాగునీరు అందించేందుకు ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయిస్తున్నప్పటికీ, చర్లపల్లిలో ఆ నిధులు ఎలా వినియోగం అవుతున్నాయన్న చర్చ గ్రామంలో నడుస్తోంది. నీటి సమస్య పరిష్కారంలో పాలకవర్గం, అధికారులు విఫలమయ్యారని ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు. వేసవి కాలం తీవ్రం అవుతున్న నేపథ్యంలో నీటి అవసరం పెరుగుతుండగా, అందుబాటులో ఉన్న పంపులే సరిగా పనిచేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ప్రత్యామ్నాయ నీటి వనరులు ఉన్నప్పటికీ, వాటిని వినియోగంలోకి తీసుకురావడంలోనూ నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం, కార్యదర్శి సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే చెడిపోయిన చేతి పంపులను మరమ్మతు చేసి, గ్రామానికి తాగునీటి సరఫరాను సక్రమంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# సహాయ నిధి పేదలకు ఒక వరం

## ఎమ్మెల్యే గిత్త.జయసూర్య.



**నేటి సాక్షి,పాములపాడు:** నందికొట్కూరు నియోజకవర్గం పాములపాడు మండలం రుద్రవరం గ్రామానికి చెందిన జగదీశ్వర్ గౌడ్‌కి అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు వైద్య ఖర్చుల కోసం ఈడిగ జగదీశ్వర్ గౌడ్ గారికి మంజూరు జరిగినది. రుద్రవరం గ్రామానికి చెందిన ఈడిగ జగదీశ్వర్ గౌడ్ అనారోగ్యంతో కిమోథెరఫీ చేయించుకోవడానికి ఆర్థిక పరిస్థితి బాగా లేనందున చికిత్స కోసం ఆర్థిక సహాయం కావాలని నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య గారిని సంప్రదించగా, ఎమ్మెల్యే స్పందించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుని వెళ్లి 4,00,000/- నాలుగు లక్షల రూపాయలు ఆర్థిక సహాయాన్ని చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎం సహాయ నిధి నుండి హామీ పత్రం మంజూరైన లెటర్ ను కుటుంబ సభ్యులకు ఈరోజు ఎమ్మెల్యే గిత్త జయసూర్య వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో: రుద్రవరం గ్రామ నాయకులు రాచపూడి సురేష్, మండల తెలుగుయువత అధ్యక్షుడు కరీంబాష రుద్రవరం ప్రజలు సతీష్,నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్



**నేటి సాక్షి, ఆసిఫాబాద్(ఎండి ముబీన్):** పట్టణంలోని ప్రతి వార్డులో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసమే నిరంతరం కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్ తెలిపారు. పట్టణంలోని 12వ వార్డులో గత వారం రోజులుగా వాటర్ మోటార్ చెడిపోవడంతో కాలనీవాసులు తీవ్ర మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను కౌన్సిలర్ ఆత్రం కృష్ణమ్మతో కలిసి కాలనీవాసులు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి తక్షణమే స్పందించిన మున్సిపల్ పాలకవర్గం శుక్రవారం యుద్ధ ప్రాతిపదికన నూతన వాటర్ మోటార్‌ను ఏర్పాటు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించింది. ప్రజల విన్నపాలకు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించడం తమ బాధ్యత అని, వార్డుల అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించినందుకు కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సల్మాన్ ఖాన్, ఆత్రం భీం భాయ్, నూరి, సుప్రజ, జమీల్ హుస్సేన్, అఫ్తాబ్ తదితరులు పాల్గొన్నారు.

# సుదర్శనం కుటుంబానికి ఆర్థిక సాయం





- సింగపూర్ నాగేశ్వరరావు తరపున రూ. 5వేల విరాళం
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ సర్పంచ్ రామసుబ్బమ్మ

**నేటి సాక్షి,పాములపాడు:** మండలంలోని వేంపెంట గ్రామానికి చెందిన గూడెం సుదర్శనం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి అంతర్జాతీయ సమాజ సేవకుడు డాక్టర్ టేకూరి నాగేశ్వరరావు ఆర్థిక భరోసా కల్పించారు. సుదర్శనం మృతి విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మ.. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, సుదర్శనం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సింగపూర్ నుండి నాగేశ్వరరావు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేయగా, ఆయన తరపున రామసుబ్బమ్మ రూ. 5,000 నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. సుదర్శనం మరణం పార్టీకి తీరని లోటని, వారి కుటుంబానికి తాము ఎల్లవేళలా అండగా ఉంటామని రామసుబ్బమ్మ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బోనపల్లె సత్యరాజు, నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ ఆల్ఫ్రెడ్, బూత్ కన్వీనర్ వినయ్ కుమార్, ముద్దపాటి ప్రసాద్, రత్నాకర్, భాస్కర్, సుబ్బరావు, జీవన్న, ఆంథోనీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పూలే, అంబేద్కర్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలి

- బీసీ శ్రేణులకు ధనుంజయ నాయుడు విజ్ఞప్తి
- మహనీయుల త్యాగాలను చాటిచెప్పాలని పిలుపు



**నేటి సాక్షి, మిర్యాలగూడ:** ఈనెల 11వ తేదీన సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి, అలాగే 14వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వాడవాడలా ఘనంగా నిర్వహించాలని ఆ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని బీసీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటి మనుధర్మవాదుల కుటిల యత్నాలను ఎదుర్కొని, అణగారిన వర్గాలకు, ముఖ్యంగా బాలికలకు విద్యను అందించేందుకు పూలే దంపతులు చేసిన మహోన్నత త్యాగాలను నేటి తరానికి వివరించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ప్రపంచ దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి, దేశంలోని భౌగోళిక పరిస్థితులు, కుల మతాలకు అతీతంగా ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిన అంబేద్కర్ ఆశయాలను స్మరించుకోవాలని కోరారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ కొనసాగుతున్న దౌర్జన్యాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని, ఓటు విలువను, విద్య యొక్క ప్రాముఖ్యతను చాటిచెప్పాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి నాయకులు చిలకరాజు శ్రీనివాస్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యో..పాపం అక్షయ్

- మైతాపూర్'లో హెచ్‌ఎం తిట్టాడని.. స్టూడెంట్ ఆత్మహత్య
- న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థుల ఆందోళన.. 8 గంటలపాటు ధర్నా
- 'పరీక్షల్లో ఫెయిల్ అవుతావు' అన్న మందలింపే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ





**నేటి సాక్షి, రాయికల్ (రాధారపు నర్సయ్య):** రాయికల్ మండలం మైతాపూర్ గ్రామానికి చెందిన దుగ్గిళ్ల అక్షయ్ అనే విద్యార్థి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అక్షయ్‌ను 'నువ్వు పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అవుతావ'ని మందలించడంతో, ఈ ఘటనతో మనస్తాపానికి గురైన అక్షయ్ మార్చి 28న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని జగిత్యాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అక్షయ్ పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం మరణించాడు. ఈ సంఘటనపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విద్యార్థి అక్షయ్ మృతికి కారణమైన మైతాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. దాదాపు ఎనిమిది గంటలు ఎండలోనే బైఠాయించి ఆందోళన చేపట్టారు. ప్రధానోపాధ్యాయుడిని వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ధర్నా చేస్తున్న గ్రామస్తుల వద్దకు రాయికల్ ఎస్సై సుధీర్ రావు, ఎంఈఓ రాఘవులు చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ గ్రామస్తులు దాదాపు 8 గంటల పాటు రోడ్డుపై బైఠాయించి నిరసన కొనసాగించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించిన తర్వాత కూడా ధర్నా కొనసాగింది. చివరికి ప్రధానోపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ధర్నాను విరమించారు.

# ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకం

ఏపిఎం ఉమామహేశ్వరి

**నేటి సాక్షి , పాములపాడు:** పాములపాడు మండలంలోని వెలుగు ఆఫీసు లో ఈరోజు ప్రకృతి వ్యవసాయం గురించి కార్యక్రమం జరిపారు. ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమని ప్రతి ఒక్కరు సేంద్రియ వ్యవసాయంతో చేస్తూ ప్రతి ఒక్క సభ్యురాలు ప్రకృతి పసాయం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు ఆ దిశగా వెళ్లాలని ఏపి ఎం ఉమామహేశ్వరి అన్నారు పాములపాడు మండలంలోని మండల మహిళా సమైక్యలో సెర్ప్ వ్యవసాయ శాఖ ప్రకృతి వ్యవసాయ విభాగం కన్వర్జెన్సీ మీటింగ్లో భాగంగా మండల వ్యవసాయ అధికారి మహేశ్వర్ రెడ్డి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి మరియు ప్రీ మాన్సూన్ డ్రై సొయింగ్ గురించి అవగాహన కల్పించడం జరిగింది అలాగే రాబోయే సంవత్సరంలో యొక్క ప్రభావం ఎలా ఉంటుందో వివరించారు డివిజన్ యం టీ సయ్యద్ భాష సార్వత్రిక సూత్రాల గురించి ప్రకృతి వ్యవసాయంలో పండించే మార్కెట్ ఉత్పత్తుల గురించి అలాగే బయో రిసోర్స్ సెంటర్ యొక్క ఉపయోగాల గురించి మహిళా సంఘాల సభ్యులకు ప్రతి ఇంట్లో పెరటి తోటల పెంపకాలపై అవగాహన కల్పించారు అలాగే పీఎండిఎస్ లో భాగంగా విత్తన గుళికలు తయారు చేసి లైవ్ డేమో చూపించడం జరిగింది ఏపీఎం .ఉమామహేశ్వరి మండల సమైక్యలో జరుగుతున్నటువంటి ఎఫ్ పి జి సంఘాలలో ప్రతి ఒక్క సభ్యురాలు కూడా ప్రకృతి వ్యవసాయం కనీసం అర్ధ ఎకరంలో చేయడం మరియు ప్రతి ఒక్క ఇంటి దగ్గర పెరటి తోటల పెంపకాలు చేయాలి ప్రకృతి వ్యవసాయంలో పండించినటువంటి పంటలను మార్కెటింగ్ చేసుకునే విధంగా సహకరించాలని చెప్పారు ఈరోజు కార్యక్రమంలో భాగంగా క్లస్టర్ కోఆర్డినేటర్లు కృష్ణారెడ్డి వెంకటరమణ గాంధీ నాగన్న ఎఫ్ఎం టి నజీర్ బి ఆర్ సి ఓనర్ ఆలీం సుల్తాన ప్రక్రృతి వ్యవసాయ సిబ్బంది, వివోఏ లు మహిళా రైతులు పాల్గొన్నారు




# ధన్వాడ ఎస్సైకు ఘన సన్మానం



**నేటి సాక్షి,నారాయణపేట(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్ గౌడ్‌ను మహాత్మ జ్యోతిరావు పూలే విద్యాభివృద్ధి సేవా సంఘం ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాల వేసి హార్ధిక శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న ఎస్సై సేవలను వారు ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం కమిటీ సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడిగా ఆంజనేయులు గౌడ్



**నేటి సాక్షి,మొయినాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడిగా మొయినాబాద్ మండలం చిన్నమంగళారం గ్రామ ఉపసర్పంచ్ అవిశిపేట ఆంజనేయులు గౌడ్ నియమితులయ్యారు. శుక్రవారం ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షులు అల్లం శ్రీనివాస్ రెడ్డి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఆంజనేయులు గౌడ్ గత పదేళ్లుగా నిస్వార్థంగా ప్రజా సేవ చేస్తున్నారని, అటువంటి నాయకత్వం రాష్ట్రంలోని ప్రజా ప్రతినిధులకు ఎంతో అవసరమని కొనియాడారు. ఈ పదవికి ఆయన పూర్తి స్థాయిలో న్యాయం చేస్తారనే నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం నూతన అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపసర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని, అందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలమణి రాములు, వార్డు మెంబర్లు రమేష్, నిర్మల మహిపాల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, బిక్షపతి గౌడ్, వెంకటేష్ గౌడ్, శివశంకర్ మరియు గ్రామ యువకులు సురేష్, ప్రసాద్, కిరణ్, అనిల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# బేతవోలులో బోరు పనులు ప్రారంభం




**నేటి సాక్షి,చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని గ్రామ సర్పంచ్ వట్టికూటి నాగయ్య తెలిపారు. శుక్రవారం బేతవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1.50 లక్షలతో మంజూరైన మంచినీటి బోరు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తామని, ప్రభుత్వం నుండి వచ్చే నిధులను ప్రాధాన్యత క్రమంలో వెచ్చించి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులకు నీటి ఇబ్బందులు కలగకుండా ఈ బోరు పనులు చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఏడుకొండలు, వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా పోషణ పక్వాడ్



**నేటి సాక్షి.చిలుకూరు:** చిలుకూరు మండలం జెర్రీ పోతుల గూడెంలో పోషణ పక్వాడ కార్యక్రమంలొ పాల్గొన్న సూపర్వైజర్ ఉపేంద్ర టీచర్లు సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం గ్రామంలో శుక్రవారం ఐ సి డి ఎఫ్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల నుండి గర్భిణీ స్త్రీలకు బాలింతలకు చిన్నారులకు పౌష్టికాహారం అందుతున్నట్లు గా తెలిపారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఉపేంద్ర గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు అంగన్వాడి సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు విలాసకవి నిర్మల అంగన్వాడి టీచర్లు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భయాన్ని తొలగించడమే అధ్యాపకుల కర్తవ్యం




- కేఎన్ఎం కళాశాలలో ముగిసిన జాతీయ స్థాయి వర్క్ షాప్
- ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ ఇంద్రకాంత్

**నేటి సాక్షి,మిర్యాలగూడ:** స్థానిక కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'బేసిక్ స్టాటిస్టిక్స్ ఇన్ టీచింగ్ ఆఫ్ ఎకనామిక్స్' అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ వర్క్ షాప్ శుక్రవారంతో ఘనంగా ముగిసింది. ముగింపు వేడుకలకు ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఇంద్రకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కొద్దిమందికే పరిమితమైన స్టాటిస్టిక్స్, ప్రస్తుతం అన్ని శాస్త్రాల్లోనూ అంతర్భాగమైందని అన్నారు. స్టాటిస్టిక్స్ అంటే విద్యార్థుల్లో ఉన్న భయాందోళనలను తొలగించి, వారికి సులభంగా అర్థమయ్యేలా బోధించడమే అధ్యాపకుల ముఖ్య కర్తవ్యం అని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చిట్టెడి కృష్ణారెడ్డి రిసోర్స్ పర్సన్ గా విచ్చేసి, వివిధ అంశాలపై అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ భీమార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వర్క్ షాప్ డైరెక్టర్ డాక్టర్ గుమ్మడి నరేష్‌ను, ప్రిన్సిపల్‌ను ప్రొఫెసర్ ప్రత్యేకంగా అభినందించారు. లంచ్ స్పాన్సర్ చేసిన గాయత్రి రైస్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల సాంబశివరావు (బాబురావు) మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధి కార్యక్రమాలకు ఎల్లప్పుడూ తమ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుండి వచ్చిన అధ్యాపకులు, కళాశాల సిబ్బంది నంద్యాల శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించడమే ధ్యేయం





- నందిమేడారంలో రూ. 5.75 కోట్లతో నిర్మించిన సీహెచ్‌సీని ప్రారంభించిన మంత్రి అడ్లూరి
- పేదలకు చేరువగా కార్పొరేట్ స్థాయి వైద్యం: కలెక్టర్ కోయ శ్రీహర్ష

**నేటి సాక్షి,ధర్మారం:** పేద ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ధర్మారం మండలం నందిమేడారం గ్రామంలో రూ. 575 లక్షలతో నూతనంగా నిర్మించిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (సీహెచ్‌సీ) జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా, వారి ఇంటి వద్దనే కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే సంకల్పంతో ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సహకారంతో ఆసుపత్రికి అవసరమైన నిధులు, పరికరాలు, సిబ్బందిని మంజూరు చేయించామని మంత్రి వివరించారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఆసుపత్రి నిర్మాణం కోసం స్థలాన్ని ఉచితంగా అందించిన మురళీధర్ రావు కుటుంబ సభ్యులకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక పరికరాలు, మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు సేవ చేయడంలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్ల నాయక్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రమోద్ కుమార్, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్, ప్రజా ప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆయుష్ దినోత్సవం



- యోగా చేసిన కలెక్టర్ ప్రతీక్ జైన్
- ఆయుష్ దినోత్సవంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ రాంపురం శివారెడ్డి
- పాత జిల్లా ఆసుపత్రిలో ఉచిత హోమియోపతి వైద్య శిబిరం

**నేటి సాక్షి,నారాయణపేట (ఇమామ్ సాబ్):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 10వ రోజున జిల్లాలో "ఆయుష్ దినోత్సవం"ను ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి చంద్ర మోహన్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా మరియు ధ్యానం (మెడిటేషన్) సెషన్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఏఎంసీ చైర్మన్ రాంపురం శివారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని స్వయంగా యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా యోగా నిపుణులు సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, అనులోమ-విలోమ పద్ధతులపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతిరోజూ యోగా సాధన చేయడం వల్ల శరీరానికి ఉత్తేజం కలగడమే కాకుండా, మానసిక ఒత్తిడి తగ్గి ప్రశాంతత లభిస్తుందన్నారు. జీవనశైలి వ్యాధులను నివారించి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అనంతరం పాత జిల్లా ఆసుపత్రి పరిధిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత హోమియోపతి వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ శిబిరంలో రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ లింగయ్య, అడిషనల్ కలెక్టర్లు ఫణిందర్ రెడ్డి, శ్రీను, బీజేపీ నాయకులు నాగురావు నామాజీ, ఇతర అధికారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖాళీ ప్లాట్లలో చెత్త వేస్తే కఠిన చర్యలు

## 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా,



**నేటి సాక్షి, కొమరం భీం ఆసిఫాబాద్(ఎండి ముబీన్):** ఈరోజు రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలోని ఓల్డ్ రాజంపేట మరియు సాయి నివాడ గల్లీలో పారిశుధ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సర్పంచ్ బుర్రా పోచయ్య ఆధ్వర్యంలో జరిగింది. వార్డు సభ్యులు గులాం జావిద్, కిషోర్ మరియు లావణ్య చురుగ్గా పాల్గొని స్థానిక ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వార్డు సభ్యులు మాట్లాడుతూ, ఖాళీ ప్లాట్లలో చెత్త వేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని తెలిపారు. ఇకపై ఎవరైనా చెత్త వేస్తే పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అలాగే అడ్డగోలుగా చెత్త వేయడం వల్ల దోమలు, ఈగలు పెరిగి అనారోగ్య సమస్యలు వస్తాయని, ముఖ్యంగా చిన్న పిల్లలు మరియు వృద్ధుల ఆరోగ్యం దృష్ట్యా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వార్డు సభ్యురాలు లావణ్య కోరారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఖాళీ ప్లాట్లలో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా గ్రామాన్ని ఆరోగ్యవంతంగా, పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ చెత్తను పంచాయతీ ట్రాక్టర్లకే అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# నేడు మంత్రి పొంగులేటి పర్యటన

## ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ

**నేటిసాక్షి, తిరుమలాయపాలెం(రుద్రరాజు ):** తిరుమలాయపాలెం మండలంలో శనివారం తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించనున్నారు ముందుగా మండలంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో తిరుమలాయపాలెం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు. చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేయనున్నారు అనంతరం హైదర్ సాయిపేట గ్రామంలో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు కావున ఈ యొక్క కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను పొంగులేటి అభిమానులను అధిక సంఖ్యలో పాల్గొనీ విజయవంతం చేయాలని పాలేరు నియోజకవర్గం ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ తెలిపారు

# పశువుల కొట్టాలను కూల్చేశారు

## కోర్టు ఆదేశాలు దిక్కరించారు..

**నేటి సాక్షి, తిమ్మాపూర్:** 'మా పశువుల కొట్టాలను దౌర్జన్యంగా కూల్చేశారు. కోర్టు ఆర్డర్ ఉన్నా, దానిని ధిక్కరించి రాజకీయ నాయకులు, అధికారుల అండదండలతో తమపై దౌర్జన్యం చేశారు' అంటూ బాధితుడు తిమ్మాపూర్



మండలంలోని నుస్తులాపూర్ గ్రామస్తుడు దూల్గుంటి అనూప్ రెడ్డి మీడియా ఎదుట తన గోడును వెల్లబోసుకున్నాడు. తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్ పాత గ్రామానికి వెళ్లే దారి పక్కన ఉన్న పశువుల కొట్టాలను అధికారులు కూల్చివేయగా, శుక్రవారం తిమ్మాపూర్లో ఆయన మీడియాతో మాట్లాడారు. నుస్తులాపూర్ లో సుమారు 60ఏళ్లకు పైగా నక్ష దారి ఉందనీ, దాని పక్కనే ఉన్న పట్టా భూమిలో వారి తాతలు పశువుల కొట్టాలు నిర్మించారని బాధితుడు తెలిపాడు. పక్క వారు భూమిని సర్వే చేయించుకొని, తమ పట్టా స్థలంలో దారి ఉందంటూ తన భూమిలోకి వచ్చారని చెప్పాడు. దీనిపై గ్రామంలో పంచాయితీలు జరిగిన విషయాన్ని గుర్తు చేశాడు. పశువుల కొట్టాలు తొలగించాలని నుస్తులాపూర్ పంచాయతీ కార్యదర్శి నోటీసు జారీ చేస్తే తాము హై కోర్టుతో పాటు జిల్లా కోర్టుకు వెళ్లగా స్టే, ఇంజక్షన్ ఆర్డర్ ని ఇచ్చాయని అనూప్ రెడ్డి తెలిపారు. ఆర్డర్లు అధికారులతోపాటు పక్క భూమి వారికి వచ్చాయన్నారు. కోర్టు ఆదేశాలుండగా రాజకీయ నాయకులు, అధికారులు, నాయకుల సహకారంతో పక్క భూమి వారు దౌర్జన్యంగా తమ పశువుల కొట్టాలను కూల్చి వేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై కోర్టు ఆదేశాలు చూపిస్తూ పోలీసు, రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లితే పట్టించుకోవడం లేదన్నాడు. కోర్టు ఆదేశాలను దిక్కరించిన వ్యక్తులతోపాటు అధికారులు, నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు. దీనిపై తిమ్మాపూర్ తహసీల్దార్ శ్రీనివాస రెడ్డిని వివరణ కోరగా కూల్చివేతకు తమకు సంబంధం లేదనీ, 858 సర్వే నంబర్ లో పశువుల కొట్టాలు లేవన్నారు. నక్షా దారిలోనే కొట్టాలు ఉన్నాయని తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యే కందాళ పర్యటన

**నేటి సాక్షి,తిరుమలాయపాలెం(రుద్రరాజు):** పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి పర్యటన ఉ. 11:30 గంటలకు చౌటపల్లి గ్రామానికి చెందిన సుందరయ్య-అనూషల వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. ఈ కార్యక్రమం పాలేరు లోని బీవీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరుగుతుంది. మ. 12:00 గంటలకు బచ్చోడు గ్రామంలో జరిగే వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. మ. 12:30 గంటలకు సుబ్లేడు గ్రామంలో జరిగే పట్టు వస్త్రాల అలంకరణ కార్యక్రమంలో పాల్గొంటారు. మ. 01:30 గంటలకు రెడ్డిపల్లి గ్రామంలోని అమ్మ ఫంక్షన్ హాల్‌లో జరిగే వెడ్డింగ్ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. మ. 02:00 గంటలకు గూడూరుపాడు గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శిస్తారు. రా. 08:00 గంటలకు గుర్రాలపాడు గ్రామంలో జరిగే ప్రీ వెడ్డింగ్ కార్యక్రమంలో పాల్గొంటారు. కావున ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మీడియా ప్రతినిధులు హాజరు కావలసిందిగా తిరుమలాయపాలెం బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భాష పోయిన వీరన్న కోరారు.

# తాగునీటి సమస్య పరిష్కారం

## టీడీపీ నాయకుడు కేశన్న చొరవ



**నేటి సాక్షి :** మంత్రాలయం మండలం తిమ్మాపూర్ గ్రామంలో మంచినీటి పైపులైన్ లీకేజీ కారణంగా కొంతకాలంగా గ్రామస్థులకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను గమనించిన స్థానిక టీడీపీ నాయకుడు కేశన్న వెంటనే స్పందించి, సుమారు రూ.30 వేల వ్యయంతో పైపులైన్ మరమ్మతులు చేపట్టించారు. పనులు పూర్తవడంతో గ్రామంలో తిరిగి తాగునీటి సరఫరా పునరుద్ధరించబడింది. తక్షణ చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించిన కేశన్నకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చేయాలని కోరారు.

# ఉచిత వైద్య శిబిరం

**150 మందికి పరీక్షలు**



**నేటి సాక్షి,మునగాల :** మునగాల మండల పరిధిలోని నరసింహపురం గ్రామంలో శుక్రవారం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామ ప్రజల నుండి భారీ స్పందన లభించింది. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ డా. వేమూరి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 150 మంది రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈ శిబిరంలో ముఖ్యంగా షుగర్, బీపీ మరియు కంటి సంబంధిత వ్యాధులకు నిపుణులైన వైద్యులు తనిఖీలు చేసి తగు సూచనలు అందజేశారని తెలిపారు. సామాన్యులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేయకుండా, ప్రభుత్వం అందిస్తున్న ఇటువంటి ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాలు ఎంతో ప్రయోజనకరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# బాధితులను ఆసుపత్రికి తరలిస్తే

**రూ.25వేలు 'రహవీర్' కింద ప్రభుత్వం అందిస్తుంది..**



**నేటి సాక్షి, తిమ్మాపూర్:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించిన వారికి ప్రభుత్వం రూ. 25వేల సహాయం అందిస్తుందని తిమ్మాపూర్ సీఐ సదన్కుమార్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులతో శుక్రవారం సాయంత్రం మీటింగ్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని సరైన సమయంలో ఆసుపత్రికి తరలించి, వారి ప్రాణాలను కాపాడిన వారికి రహవీర్ సూపర్హీరోస్ పేరుతో ప్రభుత్వం వారికి రూ. 25వేలు నజరానా అందజేస్తున్నదని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు ఈ విషయాన్ని తెలియజేసేందుకే సర్పంచులతో మీటింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే 'అరైవ్.. అలైవ్' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో కమిటీలు వేసి, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు ఎప్పటికప్పుడు నిర్వహించేలా ప్రత్యేక చొరవచూపాలని ఆయన సర్పంచులను కోరారు.

# దొడ్డి మేకల గ్రామాల్లో జలధర

**జలహారతి కార్యక్రమాలు నిర్వహణ**



**నేటి సాక్షి :** పెద్దకడబూరు మండలం పరిధిలోని మురవని మరియు దొడ్డి మేకల గ్రామాలలో "జలధర - జలహారతి" కార్యక్రమాల భాగంగా "నీటి భద్రత - నీటి సంఘాల బాధ్యత" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ సంజీవ్ కుమార్, పంచాయతీ ఎన్‌ఆర్జీఎస్ ఈసీ ఖాదర్ బాషా, ఇంజనీరింగ్ అసిస్టెంట్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే నీటి సంఘం అధ్యక్షుడు ఈడిగ సత్యం గౌడ్, రామలింగ యూనిట్ ఇన్‌చార్జి దుమ్మల శివన్న, చిలక నరసింహులు, గ్రామ అధ్యక్షుడు చంటన్న, బి. నర్సింలు, బీటీ రామకృష్ణ, బీటీ మూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్ చెన్నకేశవ, బోయ వీరేష్, నాగిరెడ్డి, ఉప్పర లక్ష్మన్న, కంపాడు మునెప్ప, స్కూల్ కమిటీ చైర్మన్ దస్తగిరి, కొండయ్య, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు నీటి ప్రాముఖ్యత, నీటి సంరక్షణ అవసరం, సమర్థవంతమైన వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా మురవని గ్రామంలో పూల చెరువు, తిమ్మన్నగారి కుంట, సుగురు మేజర్ కాలువలలో కంప తొలగింపు, పూడికతీత పనులు చేపట్టాలని గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు. అదేవిధంగా చెక్ డ్యాములు నిర్మించాలని కోరారు. దొడ్డి మేకల గ్రామంలో దొడ్డి మేకల నుండి వగరూరు వంక, ఈర్లపాటయ్య వంకల వద్ద చెక్ డ్యాములు నిర్మించాలని గ్రామస్తులు కోరుతూ తమ వినతి పత్రాలను ఏఈ సంజీవ్ కుమార్‌కు అందజేశారు. గ్రామాల అభివృద్ధి కోసం నీటి వనరుల సంరక్షణ అత్యవసరమని అధికారులు పేర్కొన్నారు




# రైతులు ఒకే మొబైల్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలి

- పథకాలు, ఎరువుల బుకింగ్‌లో ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు
- వెంటనే ఏఈఓలను సంప్రదించాలని ఏఓ రుషేంద్రమణి సూచన

**నేటి సాక్షి, మిర్యాలగూడ :** రైతులు ప్రభుత్వం అందజేస్తున్న రైతు భరోసా, ఫార్మర్స్ రిజిస్ట్రీ మరియు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌లలో ఒకే మొబైల్ నంబర్‌ను నమోదు చేసుకోవాలని దామరచర్ల మండల వ్యవసాయ శాఖ అధికారి రుషేంద్రమణి సూచించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రభుత్వ పథకాలు మరియు ఎరువుల కొనుగోలు ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ఈ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మూడు విభాగాల్లో వేర్వేరు నంబర్లు ఉన్నట్లయితే, భవిష్యత్తులో ఎరువుల బుకింగ్ సమయంలో సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ఒకవేళ నంబర్లు వేర్వేరుగా ఉన్నా లేదా పాత నంబర్ అందుబాటులో లేకపోయినా, వెంటనే సంబంధిత అగ్రికల్చరల్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్లను (ఏఈఓ) సంప్రదించి ఒకే నంబర్ ఉండేలా అప్‌డేట్ చేయించుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ప్రభుత్వ లబ్ధి నేరుగా, వేగంగా అందుతుందని ఆయన వివరించారు.

# మరకత లింగాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్

**నేటి సాక్షి,శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు నిర్వాహకులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శివ సాయి ప్రసాద్ వేద మంత్రోచ్చారణల మధ్య ఎమ్మెల్యేకు ప్రత్యేక ఆశీర్వచనం అందించగా, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి ఆయనను శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆధ్యాత్మికత మనిషిని మంచి మార్గంలో నడిపిస్తుందని, ఇలాంటి పవిత్ర క్షేత్రాలను దర్శించుకోవడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో శాంతి, సామరస్యం మరియు అభివృద్ధి మరింతగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వైస్ చైర్మన్ శేఖర్, కార్యదర్శి జనార్ధన్, స్థానిక నాయకులు మరియు అనుచరులు పాల్గొన్నారు.



# పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలి



**కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**నేటి సాక్షి,ధర్మారం:** ధర్మారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర (పీహెచ్‌సీ) భవనాన్ని తక్షణమే ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని సందర్శించి, నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆసుపత్రి భవనానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పెయింటింగ్, లైటింగ్ మరియు కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో ఎటువంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. పనులు పూర్తయిన వెంటనే భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, మండల వైద్యాధికారి డాక్టర్ అనుదీప్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రైతును రాజు చేయడమే ప్రభుత్వ ధ్యేయం

**గుమ్మడి సోమయ్య**



**నేటి సాక్షి,ములుగు :** రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుమ్మడి సోమయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని అకినేపల్లి మల్లారం గ్రామంలో వివేకా ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డితో కలిసి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క నాయకత్వంలో వ్యవసాయ రంగానికి వేలాది కోట్ల బడ్జెట్ కేటాయించి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ కల్పిస్తున్నామని పేర్కొన్నారు. వివేకా రైతు ఉత్పత్తిదారుల సంఘం స్థానిక రైతాంగానికి విత్తనాలు, యంత్రాలను సబ్సిడీపై అందిస్తూ సేవ చేయడం అభినందనీయమని సోమయ్య కొనియాడారు. సాంబశివరెడ్డి మాట్లాడుతూ.. తమ సంఘానికి ధాన్యం కొనుగోలు కేంద్రం మంజూరు చేసినందుకు మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన గుమ్మడి సోమయ్యను స్థానిక నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి సయ్యద్ షా ఫైసల్ హుస్సేని, జిల్లా మేనేజర్ కృష్ణవేణి, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో బద్రు నాయక్, సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ సూరి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జయరాంరెడ్డి మరియు రైతులు పాల్గొన్నారు.





# కౌతాళంలో విషాదం

**ఇద్దరి మృతి, నేతల ఘన నివాళులు**

**నేటి సాక్షి:** కౌతాళం మండలం హాల్వి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కుంటి వెనప్ప అనారోగ్యంతో మృతి చెందారు. పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ, గ్రామ అభివృద్ధికి కృషి చేసిన వెనప్ప మరణం స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. ఆయన మృతి పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇదే సమయంలో మండల కేంద్రంలోని ప్రతిభ స్కూల్ యాజమాన్యం దూద్ బాషా తల్లి వృద్ధాప్యంతో కన్నుమూశారు. ఆమె మరణం కుటుంబ సభ్యులతో పాటు స్థానికులకు కూడా తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ రెండు మరణ వార్తలు తెలుసుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు మృతుల స్వగ్రామాలకు చేరుకుని, వారి మృతదేహాలను సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇలాంటి దుర్ఘటనలను తట్టుకునే ధైర్యం భగవంతుడు వారికి ప్రసాదించాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో విషాద వాతావరణం నెలకొంది.